చరిత్ర చిరం జీవి. అంతే కాదు...చరిత్ర కథా సాగరం. అందునా ఆంధ్రదేశ చరిత్ర కథా సరిత్సాగరం. అనేక కారణాల వల్ల చారిత్రక కథలూ, కథలోని వ్యక్తుల వ్యక్తిత్వాలూ అపార్థాలకు లోను అయినాయి. కాని, చరిత్రకు చావు లేదు.

పల నాటి భారతంలో శకుని పాత్రగా ప్రచారం పొందిన నాయకురాలు నాగమ్మ న్యాయ మూర్తి, నిర్దోషి అని నా అభిప్రాయం. సహృదయ పాఠక మహాశయులకు ఈ విషయం వివాదగ్రస్తమైనదిగా అనిపిస్తే చర్చకు నేను సిద్ధంగా ఉన్నానని వినమ్ర భావంతో విన్న వించుకుంటున్నాను. - లల్లాదేవి

"అమ్మా శివానీ!"

"నాన్నగారూ!"

"నీధుల పత్నీడు వార్త పంపినాడమ్మా!"

"ఏమని?"

"నీవు పార్వతీదేవి అవతారంగా పలనాటి సీమలో పుట్టినావట. ఉత్తరాది నుంచి అంటే జంభనాపురి ( జబల్ పూర్ ) నించి వలస వచ్చిన అనుగురాజు, దొడ్డనాయుడు రాష్ట్రకూటులతో తగవు తెచ్చి పెట్టున్నారు కదా! ఆరణి గండ్లలో జొన్నకంకుల యుద్ధం గురించి రాష్ట్రకూటులు ( రెడ్లు ) ఇంకా మరిచిపోలేదు. ఉత్తరాదివాడయిన అనుగురాజు రాజ్యభ్రష్టుడయి దక్షిణాదికి వలస వచ్చాడు. వస్తూ విజ్జలదేవిని, భూరమాదేవిని—పత్నులిద్దరినీ వెంట తెచ్చుకున్నాడు. ఇక్కడకు వచ్చాక దక్షిణాదివా రింటి ఆడపడుచు అయిన మైలమా దేవిని మరలా పెళ్ళి చేసుకున్నాడు.

అంతవరకూ అనుగురాజు నిస్సంతువు. మైలమా దేవిని పెళ్ళి ఆడాక ముందుగా ఆమెకు నలగాముడు జన్మించాడు. ఆ తరవాత ఉత్తరాది వా రింటి ఆడ పడుచు లయిన విజ్జలదేవి, భూరమాదేవులు గర్భం తాల్చి ఏడుగురు బిడ్డల్ని ప్రసాదించారు.

విజ్జలదేవికి మలిదేవాదులు ముగ్గురు. భూరమా దేవికి కామరాజు, నరసింగరాజు, చెట్టిరాజు, పెరుమాళ్ళు అని నలుగురు బిడ్డలు.


దొడ్డనాయుడి పెత్తనం పోయి కుమారు డయిన బ్రహ్మనాయుడి మంత్రిత్వం వచ్చింది. వారంతా ఉత్తరాహులు దక్షిణాది వా రింటి ఆడపడుచుకు పుట్టిన అగ్రజుడు నాస్తసంగారాజ్యార్హుడు. మైలమా దేవి పసుపుకుంకాల కింద పలనాటి సీమ వారికి దక్కింది.

కాని, చిత్రం చూశావా?

పలనాటికి మలిదేవాదులు వారసులు కావాలని బ్రహ్మనాయుడు వాదిస్తున్నాడు.

ఇది అన్యాయమని, అర్ధ వీటిలో ఆటవికుల నాయకుడయిన నీధుల పత్నీడు బాధ పడ్డాడు.

ఇలా దక్షిణాది వా రింటి ఆడ పడుచు మైలమా దేవికి అన్యాయం జరుగుతూ ఉంటే పల్నాటి పార్వతి, శివానీ, పలనాటి ఆశా కిరణం అయిన నాగమ్మ మౌనం వహించరాదని కబురు పంపాడు" అని బదులిచ్చాడు చౌదరి రామిరెడ్డి.




శివానీ శ్రద్ధాసక్తులతో తండ్రి మాటలు విన్నది. జిట్టిగామాలపాడులో చౌదరి రామిరెడ్డిగారిది అంకంత లోగిలి. వారి చావడిలో ఖణేల్మన రంకెవేసే బసవన్నలు బారులు తీరి నిలిచి ఉంటాయి. ఎత్తిన చాట దింప కుండా నిరతాన్నదానం జరుగుతూనే ఉంటుంది. ఆ చుట్టు పక్కల ఉండే రాష్ట్ర కూట కుటుంబాలకు పెద్ద దిక్కు వారే!

వారి ఏకైక సంతానం నాగమ్మ! ముద్దు పేరు శివానీ! మేనమామ, అర్ధాయుష్కుడు అయిన ఆరవిల్లి సింగారెడ్డిని పెళ్ళి ఆడి, పసి వయస్సునే పసుపు కుంకుమలు పోగొట్టుకుంది.

ఆమె శరీరకాంతి ఉజ్జ్వలం. ముఖ వర్చస్సు

# అగ్ని ప్రసూన

## లల్లాదేవి



మహోజ్వలం. నేత్రాలు అగ్నిచక్రాలు. ఆలోచనలు అమృతధారలు. మాటలు వీణమీద వేదాలు పలికించినంత సుమధుర మధురసాలు. భాష తెలుగు భారతికి విజయ కేతనాలు. ఆమె మేధాసంపత్తి హోమాగ్ని జ్వాల.

పలనాటి ప్రజలకు పార్వతీదేవిలా పూజనీయురాలు. ఔత్తరాహుల ఆగడాలను అరికట్టేందుకు అవతారమెత్తిందని దాక్షిణాత్యు లందరూ చెప్పుకుంటున్నారు.

వీధుల పల్నీడు హరిజన, గిరిజన వర్గాల ప్రతినిధి. అకుంఠిత దేశభక్తుడు. మైలమాదేవి పసుపు కుంకాల కింద వచ్చిన పలనాటిని మలిదేవాదులకు అంట కట్టాలన్న ఆలోచనను భరించలేక నాగమ్మకు వార్త పంపాడు.

భర్త వియోగంతో విరాగి అయిన నాగమ్మ అంతర్యాన్ని తండ్రి బోధలూ, వీధుల పల్నీడి వార్తలూ కదిలించాయి. ప్రజలు ఆమె మీద పెంచుకున్న ఆశలు నిరాశలు కాకూడదు.

పసితనంలోనే పసుపు కుంకుమలు కోల్పోయి నిరర్థకమై పోతుందనుకున్న జీవితానికి పరమేష్టి ఒక నూతన మార్గాన్ని నిర్దేశిస్తున్నాడు కాబోలు అనిపించింది.

"నాన్నగారూ! అనుగురాజు వేటకై వస్తున్నారని విన్నాను. వారు వచ్చే దారి పొడుగునా చలువ పందిళ్ళు వేయించండి. విడిది దిగిన చోటల్లా వారి వారి పరివారానికి దండి భోజనాలు వండి పెట్టించండి. సర్వోపచారాలు అమరించండి. ఆ పైన సంగతులు నేను చూసుకుంటాను" అన్నదామె.

దిగులు మూట కట్టినట్టుగా ఎప్పుడు ఏకాంతంలో ఉండాలని ఆశించే శివానీ శాకిని విషయాల మీదికి

దృష్టి మరల్చినందుకు ఆనందించాడు చౌదరి రావి రెడ్డి.

వెంటనే ఆమె సూచనల ప్రకారం అనుగురాజుకు దారి పొడవునా స్వాగత సత్కారాలు ఏర్పాటు చేయించారు.

# 2

"అమ్మా శివానీ!"

"ప్రభూ!"

"మీరు చూపినగౌరవాభిమానాలు మా మనసును అలరించినాయి. ఏం కావాలో కోరుకో" అన్నారు ప్రభువు అనుగురాజు.

"ప్రభూ! భర్తలేని దానను. బతుకులో సర్వ సౌఖ్యాలకు దూరమయిన దానను. పలనాటి ప్రజల సుఖ సంతోషాలు తప్ప నాకే కోరికలూ లేవు" అన్నది శివానీ.

"నాగమ్మా! పలనాటి ప్రజల సుఖ సంతోషాలకు ఇప్పుడు లోటు వచ్చిందనా నీ అభిప్రాయం?" అన్నారు ప్రభువు.

నాగమ్మ పెదవుల మీదుగా తెల్లని చిరునవ్వు వెన్నెల కిరణం లా రాలి పడింది.

"ప్రభూ! పలనాటి సీమ నా ప్రాణం. పలనాటి ప్రజల సుగుణాలే నా అలంకారాలు. అనుక్షణమూ నా ఆలోచన పలనాటి గురించి మాత్రమే! అద్దంకి నించి కొండవీడు దాకా విస్తరిల్లిన ఈ సువిశాల మహా సామ్రాజ్యం మీ ఏలుబడిలో సుఖశాంతులతో వర్ధిల్లుతోంది. అందువల్ల నేను కోరదలచిన దేమీ లేదు" అన్నదామె.

ఆమె అకుంఠిత దేశభక్తి ప్రభువు హృదయాన్ని ఆకట్టుకుంది. ఆయన కన్నులు చెమరించినాయి.

"శివానీ! మీ వంటి దేశ భక్తుల అండదండలే నాకు కొండంత బలాన్ని ఇస్తున్నాయి. నీకేం కావాలో కోరుకో ఇచ్చేస్తాను. కాదనను" అన్నాడు ప్రభువు.

నాగమ్మ కొద్ది క్షణాలు ఆలోచించింది.

"ప్రభూ! మహాదేవుడు ప్రసాదించిన భస్మరాసి నాకు అష్టైశ్వర్యాలు అనుకున్నాను. నా కింటూ ఎటువంటి కోరికలూ లేవు. నా పలనాటి ప్రజలకు సేవచేసుకునే అవకాశం ఇప్పించండి చాలు" అంటూ విన్నవించుకుం దామె.

"అంటే?" అనుగు రాజు భృకుటి ముడిపడింది.

"ఏడు గడియలకాలం నాకు మంత్రిపదవి ఇప్పించండి" అన్నది నాగమ్మ.

ఆ కోరిక విని అనుగురాజు పకాలున నవ్వినాడు.

"ఏడు గడియల మంత్రి పదవిలో ఏం చెయ్యగలవు, శివానీ?" అని ప్రశ్నించా రాయన.

"ప్రజా సేవలో ప్రబతుకుపునీతం చేసుకుంటాను, ప్రభూ! కాలం చాలా విలువ అయినది. క్షణానికుండే విలువ సృష్టిలో మరి దేనికీఉండదు. నట జంగముడు మన్మథుని భస్మరాశిగా మార్చింది ఒక్క క్షణంలోనే కాదా! కాలాన్ని వినియోగించగల నేర్పరి తనం ఉంటే ఒక్క గడియలో ప్రళయాన్ని సృష్టించ వచ్చు. పునః సృష్టి చేయనూ వచ్చు. అటువంటిది ఏడు గడియల కాలమంటే మాటలా?" అన్నది నాగమ్మ.

అనుగురాజు కళ్ళముందు మెరుపులు మెరిశాయి. శివానీ అద్భుత స్త్రీ మూర్తి అనిపించింది.

"అలాగా, శివానీ! ఈ క్షణం నించీ ఏడు గడియల కాలం నీవు మహా మంత్రివి" అన్నా రాయన.

శివానీ చేతులు ముకుళించింది.

"ప్రభూ! సమయం వచ్చినప్పుడు నేను మంత్రి పదవి స్వీకరిస్తాను. అలా అనుగ్రహించండి" అన్న దామె.

అనుగు రాజు అప్పటి కప్పుడు రాజ శాసనం వ్రాయించారు—

"నాగమ్మ తాను కావాలనుకున్నప్పుడు ఏడు గడియల కాలం మంత్రి పదవిని స్వీకరించవచ్చు" అని.

రాజశాసన పత్రాన్ని స్వీకరించి సెలవు తీసుకుంది నాగమ్మ. ఈ వార్త గురజాలకు వెళ్ళింది రాజుకన్నా ముందే! బ్రహ్మనాయునిం వారి భృకుటి ముడి పడింది. కోడె మీసం దువ్వి కోరగా చూసినా డాయన.

'ఔరా! ఆడది ఎంత జాణతనం చూపింది' అనుకున్నాడు.

నాగమ్మ జిట్టగామాలపాడు వదలి గురజాలకు వెళ్ళలేదు. పలనాటిలో ఉంటున్న రాష్ట్రకూట (రెడ్డి) కుటుంబాల వారి కీ వార్త తెలిసింది. తమ ప్రతినిధి, ఆశా కిరణం అయిన నాగమ్మతో తమ బాధలు చెప్పుకోవటం ప్రారంభించారు.

ప్రజలతో సంబంధాలు పెరిగాక రాజరికంలోని లోటుపాటులు నాగమ్మకు బాగా తెలిసి వచ్చింది. బ్రహ్మనాయుని తంత్రజ్ఞత ఆమెకు చక్కగా అర్థ మయింది.

సమయంకోసం చూస్తోంది నాగమ్మ.

అనుగురాజు రాచపుండుతో మంచం పట్టాడు. అప్పుడు నాగమ్మ గురజాలకు వెళ్ళింది. ఆమె రాక కోసం సింహద్వారా లన్నీ తెరచి ఉంచాడు రాజు.

"మంత్రిపదవికోసం వచ్చావా, నాగమ్మా?" అని హీనస్వరంతో అడిగాడు అనుగురాజు.

"రాజా! మంత్రి పదవి నా కెందుకు? ఒక మంత్రాంగం చెప్పవచ్చాను. ప్రభువులు ప్రజల కోర్కెను మన్నించాలి కదా!" అన్నది నాగమ్మ.

అనుగురాజు పేలవంగా నవ్వాడు.

"నాగమ్మా! నువ్వు ప్రజల దృష్టిలో పలనాట పుట్టిన పార్వతీదేవివి. చెప్పదలచుకున్న విషయాన్ని నిర్భయంగా చెప్పు" అన్నా డాయన.

"ప్రభూ! ధర్మ దృష్టి కలిగిన వారు మీరు. పలనాటి ప్రజలకు అన్యాయం చేయకండి. బ్రహ్మనాయుడుం వారు నలిదేవాదులకు సింహాసనం అప్పగించాలని ఆలోచిస్తున్నారు. ఉత్తరాది వారింట ఆడపడుచు అయిన వీర్లదేవి సంతానం కదా నలిదేవాదులు. ఈ పలనాటిసీమ దక్షిణాది వారింటి ఆడబిడుచు అయిన మైలమాదేవి పసుపు కుంకాల క్రింద మీకు దక్కింది.

మైలమాదేవి సుతుడయిన నలగామునికే ఈ రాజ్యం దక్కటం న్యాయం. దక్షిణాదివా రింటి ఆడపడుచు సంతానం తమను పాలించాలని కోరు కోవటం దక్షిణాది ప్రజలు కోరుకుంటున్నారు. వారి కోర్కె మన్నించండి" అన్నది నాగమ్మ.

అనుగురాజు నేత్రాలు విశాల మయినాయి. ముఖం నల్లగా అయిపోయింది.


"నాగమ్మా! పలనాటి ప్రజల కోర్కె నాకు శిరోధార్యమే! కానీ, రాజరికపు వ్యవస్థలో అగ్రభార్య సంతానమే సింహాసనానికి వారసులు కావటం సాంప్రదాయం కదా! మూడవ భార్య అయిన మైలమాదేవి సంతానికి సింహాసనం అప్పగిస్తే, అది పక్షపాతం కాదా!" అన్నారాయన. ఆ మాటకు నాగమ్మ నవ్వింది.


"ప్రభూ! నలిదేవాదులు అగ్రభార్య తనూభవులు. కాని, వయసులో అందరి కన్నా పెద్ద వాడు నలగాముడు. రాజ సంతానంలో అందరికన్నా పెద్దవాడే కదా వారసుడు కావాలి. అది న్యాయం— పలనాటి ప్రజల కోర్కె" అంది.

"పలనాటి ప్రజల కోర్కెను నేను మన్నిస్తాను. అది రాజుగా నా బాధ్యత" అన్నారు ప్రభువు

నాగమ్మ తృప్తిగా వెళ్ళిపోయింది.

అనుగురాజు నలగాముని పట్టాభిషేకానికి






ఏర్పాట్లు చేయించి నిశ్చింతగా కన్నుమూశాడు.

మైలమాదేవి నాగమ్మను పిలిపించింది. నాగమ్మ పాదాలకు నుదురు తాకించి నమస్కరించింది.

"అమ్మా...శివానీ! నీవు పార్వతీదేవి అపరావతార మని పలనాటి ప్రజలంతా చెప్పుకుంటున్నారు అందునించి వయసులో చిన్న దాని వయినా నీకు చేతులెత్తి నమస్కరిస్తాను.

నా బిడ్డ రాజు అవుతాడు. నాకు సంతోషమే! కాని బ్రహ్మనాయుడుం వారు శక్తి సంపన్నులు. శ్రీకృష్ణుడు అపరావతారమట! వారి ఆలోచనలన్నీ మా సవతి అయిన విజ్జలదేవి పక్షాన ఉన్నాయి.

నా బిడ్డ రాజు అయి మంత్రి ఆలోచనలకు వ్యతిరేకంగా తన పాలన ఎంత కాలం కొనసాగించ గలడు. బ్రహ్మనాయుని పలుకుబడి నా బిడ్డ ప్రాణా లను బలి తీసుకుంటుందేమో?" అన్న దామె కన్నీరు పెట్టుకుని.

నాగమ్మ ఆమెను ఓదార్చింది. "రాణిగారూ! రాజుకు నిజమయిన బలం ప్రజాభిప్రాయం. అది నలగాముని పక్షాన ఉన్నంతవరకూ నేనూ నలగాముని పక్షాన ఉంటాను. నలగాముడు నా బిడ్డే అనుకుంటాను, అతని సర్వరక్షణ బాధ్య తలూ నేను తీసుకుంటాను. ధర్మోరక్షతి రక్షితః. ధర్మాన్ని రక్షించే వారిని ధర్మమే కదా రక్షి స్తుంది.

నీ బిడ్డను ధర్మం కాపాడుతుంది. నా కంఠంలో ఊపిరి ఉన్నంతవరకూ నలగాముడే పలనాటికి ఏలిక. బ్రహ్మనాయుడుం వారే కాదు— స్వయంగా ఆ పద్మసంభవుడే దిగి వచ్చినా నల గాముడు పలనాటి ప్రభువు కాకుండా అడ్డగించ లేరు. ఇది నా ప్రతిజ్ఞ. మీరు నిశ్చింతగా ఉండండి" అన్నది నాగమ్మ.

ఆమె ముఖం ఉజ్జ్వల కాంతిలో విరాజిల్లు తూంది.

ఆమె అన్న ప్రకారమే నలగాముడు రాజయినాడు. అది రాజ శాసనం. బ్రహ్మన్న అడ్డగించలేదు.

కాని, కొద్దిరోజుల తరవాత నాగమ్మకు ఆసక్తి కరమయిన కొన్ని సంగతులు తెలిశాయి. 'నేను మంత్రి పదవి స్వీకరించవలసిన సమయం ఆసన్న మయింది కాబోలు. నట ధూర్జటీ! నాకు మనో ధైర్యాన్ని ప్రసాదించు' అని తనదైవమయిన నటజంగ ముని ప్రార్థించిం దామె.

గురజాలకు బయలుదేరింది.

నాగమ్మ గురజాలలో కాలు పెట్టిందన్న వార్త బ్రహ్మనాయునిం వారికి తెలిసింది. ఆయన భృకుటి ముడిపడింది. నేత్రాలు అరుణా లయినాయి.

నాగమ్మ సరాసరి సభా ప్రవేశం చేసింది.

"ప్రభూ! నలగామరాజా! మీ తండ్రి మాట మీద మీకు గౌరవ మున్నదా? ఆయన వ్రాయించి ఇచ్చిన శాసనాన్ని మీరు అమలు పరుస్తారా?" అని సూటిగా ప్రభువును ప్రశ్నించిం దామె. సభా స్థలి నివ్వెరపోయింది.

"నాగమ్మా! మీ కా అనుమానం ఎందుకొచ్చింది. నా తండ్రి శాసనాలు నాకు సర్వదా శిరోధార్యమే!" అన్నారు ప్రభువు నలగాముడు.

సదిభికులు హర్షధ్వానాలు చేశారు.

"నాకు ఏడు గడియల పాటు మంత్రిత్వం కావాలి. ఇదిగో రాజ శాసనం" అంటూ శాసన పత్రాన్ని అందించింది నాగమ్మ.

నలగాముడు దాన్ని స్వయంగా చదివాడు. బ్రహ్మనాయుడుం వారు సభా ముఖంగా మంత్రి లాంఛనాలయిన ధర్మదండమూ, అంగళీయకమూ నాగమ్మ పరం కావించి వెలుపలకు వెళ్ళిపోయినారు.

నాగమ్మ పలనాటికి మంత్రి అయింది. ఆ మంత్రి పదవి ఉండేది ఏడు గడియల కాలమే! (ఇప్పటి కాలమానంలో తొమ్మిది గంటల ఇరవై నిమిషాలు.) ఆ సమయంలో పలనాటి భవితవ్యం గురించి తాను చేయదలచుకున్నదంతా చేయగలిగింది నాగమ్మ. ఆమె మేధా సంపత్తికి ఆదొక కలికి తురాయి.

నలగాముని తండ్రి అయిన అనుగురాజుకు బ్రహ్మనాయుని తండ్రి దొడ్డనాయుడు మంత్రి. నలగామునికి అప్పటివరకూ బ్రహ్మనాయుడే మంత్రి.

వారి మధ్య తరతరాల బాంధవ్యం ఉన్నది. వారి స్నేహం అప్రతిమానమయినది. నలగామునికి బ్రహ్మనాయుడు పితృతుల్యుడు. కేవలం నాగమ్మ ఎక్కులు చెప్పినంత మాత్రాన తరతరాల బాంధ వ్యాన్ని నలగాముడు వదులుకుంటా డనుకోవటంలో అర్థం లేదు.

ఆ ఏడు గడియల కాలంలో నలగాముడు కలలో కూడా ఊహించని కటిన సత్యాలను వెలికి తీసింది నాగమ్మ.

మంత్రి పదవి వచ్చాక రాజును మంత్రాలోచనా మందిరానికి పిలిచింది శివానీ!

"ప్రభూ! మన ఆస్థానంలో కొందరు రాజ ద్రోహు లున్నారు. వారి బండారం బట్టబయలు చేయదలిచాను. మీ అనుమతీ, మీ సైనికాధి కారుల సహకారమూ కావాలి" అని అడిగింది.

ఆ రాజద్రోహులు ఎవరో నలగామునికి తెలి యదు. ఆ పని చేసేందుకు సంతోషంతో అను మతి ఇచ్చాడు

ముఖ్యమైన సైనికాధికారుల్నీ, మరి కొందరు సైనికులనూ వెంట పెట్టుకు వెళ్ళి కొద్ది సేప టికే తిరిగి వచ్చింది నాగమ్మ. ఆమె వెంట వెళ్ళిన సైనికులు అశేషమయిన ధనరాసులు నింపిన కావడి పెట్టెలతో తిరిగి వచ్చారు. ఆ ధనరాసులు ప్రభువు ముందు ఎత్తయిన రాసిగా పోయించింది నాగమ్మ. ప్రభువు ఆశ్చర్య చకితుడయినాడు.

"నాగమ్మా! ఇంత ధనమా! ఎక్కడిది?" అని అడిగాడు.

"ప్రభూ! మూషికాలు నిర్మించే నేలమాళిగ లలో అశేషధాన్య రాసులుంటాయి. ప్రభువుల ఆస్థానంలో మూషికా లున్నాయి. ఈ ధనరాసులు వారు నేలమాళిగలలో దాచినది. దీన్ని జాతీయం చేయించండి" అని ప్రార్థించిం దామె.

ప్రభువు కన్నులు చెమరించినాయి.

"నాగమ్మా! ఎవరా మూషికాలు. చెప్పు—వెంటనే వారిని పనిలో నుంచి తొలగిస్తాను" అన్నా రాయన కోపంతో.

"మీరు అలా చేయలేరేమో! ఈ ధనరాసుల్ని దొంగిలించి, దాచిన వారు ప్రభువులకు అత్యంత ఆత్మీయులు" అని విన్నవించింది శివానీ.

"వారు ఎవరయినా సరే! దేశ బహిష్కారం విధి స్తున్నాను. చెప్పు వారెవరో!" అన్నారు ప్రభువు కన్నులలో ఎర్ర జీరలు నిండగా. సైనికాధికారులకు కను సన్నలు చేసింది నాగమ్మ. ఆ ధనరాసులు దాచిన వారి పేర్లు చెప్పారు వారు.

ఆ పేర్లు విని నలగాముడు హతాశు డయినాడు. బ్రహ్మనాయుని బంధువులే వారంతా, మహామంత్రికి ఆంతరంగికులు. ప్రభువు చాలాసేపు ఆలోచనా మగ్ను డయినాడు.

"నాగమ్మా! మహామంత్రీ! నీ సునిశిత మేధా సంపత్తికి నేను కేలుమోడ్చి నమస్కరిస్తున్నాను. బ్రహ్మనాయుడుం వారు ఇంత ధనరాసిని ఎందుకు సమీకరించారు. తెలిస్తే చెప్పు" అని అడిగా రాయన డగ్గుత్తికతో.

"ప్రభూ! దృఢచిత్తంతో వినండి. ఉత్తరాది ఆడపడుచు అయిన విజ్జలదేవి సుతులు రాజులు కావాలన్న ఆలోచన బ్రహ్మనాయునిం వారి కుంది.

తన ఆలోచనకు కార్యరూపం ఇవ్వాలన్న కోరికతో వారీ ధనరాసిని సమీకరించారు. రాజకీయాలలో హృదయమున్న వారికి తావులేదు.

హృదయ ధర్మాన్ని నిరసించే ఆలోచనలే రాజకీయాలు. నలగామునిని రాజ్యభ్రష్టుని చెయ్యాలన్న కోరికతో వారీ పనిని చేశారు. కాని ప్రభూ! ఈ శివానీ ... కోసం నిలిచి పోరాడుతుంది. న్యాయమైన పలనాటి ప్రజల కోర్కెను కల్ల కానివ్వను. నందోరాజా భవిష్యతి. పలనాటికి నలగాముడే రాజు.

ఇది పలనాటి ప్రజల హృదయం తెలిసిన నాగమ్మ ప్రతిజ్ఞ'' అన్నది నాగమ్మ.

ప్రభువుల హృదయం ఈ మాటలు విని కృతజ్ఞతా భారంతో నిండిపోయింది. ఎర్రబారిన కన్నులలోంచి జారిన అశ్రుబిందువులు చెంపల మీదుగా కొండచరియలాంటి వక్షస్సు మీద పడినాయి—కొండ చరియల మీద నుంచి సెలయేళ్ళు పారినట్లు!

"నాగమ్మా! నందోరాజా భవిష్యతి అన్నావు కదా! మహామంత్రి పదవిలో నీ స్థిరోభవ!" అన్నారు ప్రభువు.

నాగమ్మ కేలుమోడ్చింది. "ప్రభూ! ఈ మంత్రి పదవి నటజంగముడు నాకిచ్చిన వర ప్రసాద మనుకుంటాను, ప్రభువుల క్షేమానికీ, పలనాటి భవితవ్యానికీ నా తన, మన: ప్రాణాలను అర్పించుకుంటాను'' అన్న దామె.

నాగమ్మ ఎక్కులు చెప్పి మహామంత్రిణి అవుతుందా? తరతరాల బాంధవ్యం కాస్సేపు ఎక్కులు చెప్తే పోతుందనుకోవటం ఎంత ఆధారం లేని ఆలోచన.

మంత్రిణి అయిందిశివానీ!

ఈ వార్త పలనాటిలో వాడవాడలా పాకింది. ప్రజలంతా పండుగులు చేసుకున్నారు. గుమ్మాలకు పచ్చాకు కట్టి పసుపు కుంకుమలు రాశారు. బూతపల్లి బుక్కాయి చల్లుకున్నారు. బూరలు వూదారు.

రుద్రవీణలు చెలరేగి మోగించారు. పలనాడంతా పండుగ అయిపోయింది.

బ్రహ్మనాయుడుబంధువులతో కలిసిగురజాల వదలి పోయాడు. మలిదే వాదులు చెరసాలలో పడ్డారు. రాజద్రోహులంతా తలలు దింపుకున్నారు.

"బ్రహ్మనాయుడా! మన భవితవ్యం ఏమిటి?'' అన్నారు బంధువులు.

"స్త్రీ బుద్ధి ప్రళయాంతకం'' అంటూ ఖసూచి అయాడు బ్రహ్మన్న.

'నాగమ్మా! నువ్వు ఆడ నాగువి. కోడెనాగువి. పగబట్టి పతీకారం తీర్చుకున్నావు. దొడ్డనాయుడి రక్తం నాలో ప్రవహిస్తే నీకు తగిన గుణపాఠం చెప్పి తీరుతాను' అనుకున్నాడు మనసులో.

బ్రహ్మనాయనిం వారు బుద్ధి నిశితం చేసి బాగా ఆలోచించినారు. ప్రజాబలాన్ని సమీకరించడం అవసరమని తోచింది వారికి. వ్యాపారులు, రైతువర్గాలయిన రాష్ట్రకూటులు, ఆటవికులు, గిరిజనులయిన పళ్ళిడు వంటి వారు, ముఖ్యంగా వైష్ణవ




బ్రాహ్మణులు—అంతా నాగమ్మ పక్షాన చేరిపోయారు.

ఇంక మిగిలిన వారు హరిజనులు, వైష్ణవ బ్రాహ్మణులు. వీరంతా అల్ప సంఖ్యాకులయినా వారిని సమీకరించాడు. బ్రహ్మన్నగారు. వారిలో దుందుడుకు వీరుడు కన్నమనీడు.

"బ్రహ్మనాయుడా! నీవు కృష్ణపరమాత్మ అపరావతారివి. ఏమి ఆజ్ఞ?'' అన్నాడు కన్నమనీడు.

"నీ పేరును అన్వర్థం చేసుకో, కన్నమనీడా!'' అన్నాడు నాయుడు.

"అంటే—?'' అర్థం కాక అడిగాడు కన్నమనీడు.

"కన్నమనీడా! నువ్వు కన్నం వెయ్యాలి.''

"ఎక్కడ?''

"గురజాల చెరసాలకు. మనరాజులు మలిదేవాదులు, వారు చెరసాలలో ఉన్నారయ్యా? వారు లేనిదే మనకు కార్యక్రమమే లేదయ్యా! కన్నంకొట్టి వారిని విడిపించాలి. వెళ్ళిరా'' అని ఆశీర్వదించారు బ్రహ్మనాయుడుంవారు.

ఒకనాటి మహామంత్రి ఆజ్ఞ ప్రకారం కన్నమనీడు ఎలుకలా గురజాల చెరసాలకు కన్నంకొట్టాడు. మలిదేవాదులు బ్రహ్మన్న అనుగ్రహంతో చెరసాల నించి పరారి అయిపోయినారు.

గురజాల కోడెనాగు పడగ విప్పి బుసకొట్టింది. నాగభూషణుడు నేత్రం తెరిచినట్లు గురజాల మండిపడింది. కన్నం కొట్టింది చాలక రాయబారం వచ్చాడు కన్నమ.

సభ నిండి పోయింది. పండిపోయింది. పెద్దలంతా చెవులు రిక్కించి రాయబారం వింటున్నారు.

"బ్రహ్మన్న రాయబారం పంపారు, ప్రభూ!'' అన్నాడు కన్నమ.

"చెరసాలకు కన్నం కొట్టిన నువ్వు రాయబారివా? నిన్ను బ్రహ్మన్న పంపాడా! రాజద్రోహి రాయబారానికి అర్హుడా! ఏ ముఖం పెట్టుకుని వచ్చావు, కన్నమా? మలిదేవాదులు పారిపోగా ఖాళీ అయిన చెరసాలలో ఇప్పుడు నిన్ను తోయిస్తాను...ఏం చేస్తావు?'' అని అడిగాడు నలగామరాజు.

నాగమ్మ అడ్డుకుంది ఆ మాటకు. "ప్రభూ! అనర్హుడయినా, రాయబారి కనక గౌరవించాలి. రాయబారం వివరించు, కన్నమా!'' అంది మంత్రిణి.

"అనుగురాజు సంతానం తమలో తాము కలహించుకోవటం బ్రహ్మనగారిని బాధిస్తోంది. పలనాటిని పంచుకోవటం మంచిది. మలిదేవాదులకు రాయబారం కావాలి'' అన్నాడు కన్నమనీడు.

నలగాముడు నాగమ్మ వంక చూచాడు.

"కన్నమా! రాజద్రోహులకు దాయభాగం ఎట్లా వస్తుంది? ఈ మాట మీ బ్రహ్మనాయనిం వారితో చెప్పు. నా మాటగా చెప్పు. వారు, వారి తండ్రీ మంత్రిత్వం నిర్వహించిన ఈ ఆస్థానంలో రాయభారానికి మరొక రెందుకు? వారే రావచ్చు కదా!'' అన్నది నాగమ్మ.

కన్నమనీడు తిరిగి వెళ్ళి బ్రహ్మన్నతో ఈ మాట చెప్పాడు. బ్రహ్మన్న కృష్ణుడు హస్తినాపురం వచ్చినట్లుగా గురజాలకు వచ్చాడు. తాను మంత్రిత్వం నిర్వహించిన ఆస్థానంలోకి రాయబారిగా కాలు పెట్టాడు.

నలగాముడు సింహాసనం దిగి ఎదుర్కొలిచ్చాడు. నాగమ్మ తల వంచి బ్రహ్మనాయనిం వారికి నమస్కరించింది. ఉన్నతమయిన ఆసనం బ్రహ్మనాయునికివ్వబడింది.

"రాజా! రాయబారం వచ్చాను'' అన్నారుబ్రహ్మన్న.

నలగాముడు నాగమ్మ వంక చూచాడు.

"ఎవరు పంపగా వచ్చారు?'' అని అడిగింది నాగమ్మ.

"మలిదేవాదులు.''

"వారి రాజ్యార్హత ఏమిటి?''

"అనుగు రాజు అగ్ర భార్య తనూభవులు.''

## పరిపూర్ణత్వం

ఒక భాగ్యవంతుడు మరణానంతరం తనని పూడ్చిపెట్టటానికి ఒక చక్కని గోరీ నిర్మింపజేశాడు. పూర్తి అయింతర్వాత దానిని మరింత పరిపూర్ణంగా చేయడానికి ఇంకా ఏమైనా చేస్తే బాగుంటుందా అనే ఆలోచన కలిగి, అది కట్టిన మేస్త్రీని పిలిచి, "ఇది పరిపూర్ణంగా కనిపించడానికి ఇంకా ఏం చేద్దామంటావ్?'' అని అడిగాడు

"ఒక్కటే తరుగ్గా ఉంది—మీ మృత శరీరం కూడా ఇందులో ఉంచేస్తే దీనికి పరిపూర్ణత్వం సిద్ధిస్తుందండీ'' అన్నాడు మేస్త్రీ.

-ప్రసీల్

# చరిత్రలో విచిత్రాలు

## జర్మనీలో సహాయ నిరాకరణోద్యమం

మహాత్మా గాంధి బ్రిటిష్ ప్రభుత్వంమీద 1921 లో సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించి, తద్వారా ఒక ఏడాదిలో స్వతంత్రం రాగలదని ప్రకటించినపుడు దేశంలో పలువురు అపహాస్యం చేశారు. సత్యాగ్రహంతోటే ఉపవాసాలతోటే స్వరాజ్యం వస్తే ఇంకేం అని విమర్శించారు. 1922 ఫిబ్రవరిలో బీహార్‌లోని చౌరీ చౌరాలో హింసాత్మక సంఘటనలు జరగడంవల్ల గాంధిజీ ఉద్యమాన్ని మధ్యంతరంగా ఆపివేశారు.

అయితే, జర్మనీ దేశంలో ఇలాంటి సహాయ నిరాకరణోద్యమం అత్యంత విజయవంతంగా జరిగింది. అది కుతూహలం కలిగించే చారిత్రక ఘట్టం.

ఒకటవ ప్రపంచ యుద్ధానంతరం వర్సైల్స్ సంధి జరిగింది. దాని ప్రకారం 25,000 చ. మైళ్ళ జర్మన్ భూభాగాలు ఫ్రాన్స్, డెన్మార్క్, పోలెండ్‌లకు లభించాయి. ఇవిగాక యుద్ధ నష్ట పరిహారం క్రింద 660 కోట్ల పౌనులు జర్మనీ మిత్ర రాజ్యాలకు వాయిదాల ప్రకారం చెల్లించాలి.

అంత సొమ్ము చెల్లించడం జర్మనీకి శక్తికి మించినపని. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అయినా తప్పలేదు. 1921 ఆగస్టులో 50 కోట్ల పౌనులు మిత్రరాజ్యాలకు చెల్లించింది. అంతటితో జర్మన్ కరెన్సీ విలువ ఘోరంగా పడిపోవడం ప్రారంభించింది. పౌనుకు 20 జర్మన్ మార్కులు ఉండవలసింది— 1921 ఆగస్టులో 250 మార్కులు, నవంబరులో 1000 మార్కులు అయినాయి. జర్మనీ ఆర్థిక స్థితి గందరగోళంలో పడింది.

ఫ్రాన్స్‌మాత్రం వూరుకోలేదు. తన కివ్వవలసిన యుద్ధ నష్టపరిహారం రెండవ వాయిదా చెల్లించాలని ఒత్తిడి తెచ్చింది. తాను చెల్లించజాలనని జర్మనీ చెప్పివేసింది. అప్పుడు ఫ్రెంచి సైన్యాలు జర్మనీలో ప్రవేశించి 1923 జనవరిలో రూర్ బొగ్గు గనులను ఆక్రమించి, అక్కడినుండి ఉత్పత్తి అయే బొగ్గును స్వాధీనం చేసుకొని నేరుగా తమ దేశానికి పంపుతున్నారు.

అపుడు జర్మనులు ఫ్రెంచి వారిపై యుద్ధం చేసే స్థితిలో లేరు. అందువల్ల సహాయ నిరాకరణ ప్రారంభించారు. రూర్ ప్రాంతంలోని జర్మన్ కూలీలు, ఉద్యోగులు, ప్రజలు... యావన్మందీ ఫ్రెంచి సైనికులతో సహకరించడానికి నిరాకరించారు. ఫ్రెంచివారికి రొట్టెలు అమ్మేవారు లేరు. బండి నడిపేవారు లేరు. అవీ ఫ్రాన్స్‌నుండి తెప్పించుకోవలసి వచ్చింది. ఆఖరుకు రూర్ బొగ్గు గనులమీది ఆదాయంకంటె ఫ్రెంచి సైన్యం అక్కడ ఉండటానికి ఎన్నోరెట్లు ఎక్కువ ఖర్చయింది. అందువల్ల తమంతట తామే ఫ్రెంచి సైన్యం, రూర్ గనులను ఖాళీ చేసి వెళ్ళిపోయింది!

మనుషులలో పట్టుదల ఉన్నపుడు దురాక్రమణ చేసిన విదేశీయులమీద సహాయ నిరాకరణ సత్ఫలితం ఇస్తుందనడానికి ఇది తార్కాణం.

— మన్నవ గిరిధరరావు

## విన తగ్గ విశేషాలు

### అమీర్ ఖుస్రో

అల్లా ఉద్దీన్ దర్బారులో అమీర్ ఖుస్రో అనే కవి ఉండేవాడు. అతడు ఉగ్గుపాలతో కవిత్వానికి మూల పురుషుడు. అతడు పద్యంగా అల్లిన పొడుపు కథ యిది: "ఇరవై మంది తలలు తీసి వేశారు. కాని, ఎవరికీ ప్రాణం పోలేదు. ఒక్క నెత్తురు బొట్టు గూడ రాలేదు." సమాధానం : తలలు తీసివేయబడినవి మరేమీకాదు. కాలి గోళ్ళూ, చేతిగోళ్ళూ!

### తేనె టీగల క్లినిక్

అమెరికాలో బెల్ట్స్‌విల్లె అనేచోట జబ్బుపడ్డ తేనెటీగలకు చికిత్స జరపడానికి, చెడిపోయిన తేనె పట్టులను బాగు చేయడానికి ఒక ఆస్పత్రిని స్థాపించారు. ఈ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తేనెటీగలకు సపర్యలు చేయడానికి నర్సు తేనెటీగలుంటాయి. చెడిపోయిన తేనెపట్టులను సూక్ష్మదర్శిని క్రిందపెట్టి పరిశీలించి పట్టులకు ఏమైనా బాక్టీరియా గాని వైరసులు గాని ఉన్నాయేమో పరిశీలించి వాటిని చంపడానికి మందులు వాడతారు. పనిని "బీ" ఇన్‌స్పెక్టర్లు చేస్తారు.

తేనె టీగలమీద మీకింత ప్రేమ ఎందు కండీ అని అడిగితే— "తేనెటీగలు వ్యవసాయ రంగంలో అతి ముఖ్యమైనటువంటి పరాగ సంపర్కంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఈ ప్రాణులే గనుక లేకపోతే వ్యవసాయపు దిగుబడి చాలవరకు క్షీణించిపోతుంది. మరి మనకు అంత సహాయం చేస్తున్నందుకు కృతజ్ఞతగా ఈ క్లినిక్‌ను ప్రారంభించాం" అన్నారు.

### విశాల నయనాలు

విశాలాక్షి అనేపేరు పెట్టుకుంటూ ఉంటారు. చేపం కళ్ళు పెద్దవి. అలాంటివి మనుషులకే గాక జంతువుల్లో గూడ ఉన్నాయి. 'మలస్కా' అనే వర్గానికి చెందిన 'ఆర్కిటూథియస్' అనే జీవి కళ్ళు చాల పెద్దవి. దీని కంటి వ్యాసం 15 అంగుళాల నుండి 17 అంగుళాలవరకు ఉంటుంది. సముద్రంలో నీలి తిమింగిలం కంటి వ్యాసం 3.93 అంగుళాల నుండి 4.71 అంగుళాలవరకు మాత్రమే ఉంటుంది.

— సేకరణ : చల్లా జయదేవ్

"అగ్రభార్య తనూభవులే కాని, అగ్రజులు కారు కదా!" అని అడిగింది నాగమ్మ.

బ్రహ్మన్న రవంత సేపు మౌనం వహించాడు. వారి గుండెలో అగ్ని కీలలు ఆవహించినాయి.

"నాగమ్మా! అనుగురాజు బిడ్డలు పరస్పరం కలహించుకోవటం నీ కిష్టమా?" అని అడిగారు వారు.

నాగమ్మ ఈ సారి నలగామని వంక చూచింది. నలగాముడు 'తగవులు నా కిష్టం లేదు' అన్నట్లు తల ఆడించాడు. ప్రభువు హృదయం నాగమ్మకు తెలిసింది.

"బ్రహ్మనాయుడుం వారి అభిప్రాయంతో నేను ఏకీభవిస్తాను. అనుగురాజు బిడ్డలు పరస్పరం కలహించుకోకూడదు. కాని, రాజ్యార్హత లేని వారికి దాయభాగం ఎలా వస్తుంది. కావాలంటే దయాభాగం ఇస్తాము" అన్న దామె.

'దాయభాగమయినా, దయాభాగమయినా కావలసింది కలహించుకోకుండా ఉండటమే కదా!' అన్నారు బ్రహ్మన్న.

"అయితే శ్రీపరత పాదభూమిని ఏలించు వారిచేత" అన్నది నాగమ్మ.

బ్రహ్మన్న హృదయం కలుక్కుమంది.

'శ్రీపరత పాదభూమి. హు. దాయభాగం కాదు. దయాభాగం. అయినా తప్పదు. ముందు మలిదేవాదుల్ని రాజుల్ని చెయ్యాలి. ఆ పైన నాగమ్మ సంగతి చూడవచ్చు' అనుకుని తల వూగించి, తల దించి తను వచ్చిన దారిన వెళ్ళిపోయారు బ్రహ్మనాయనింవారు.

కోడెనాగు బుస తగ్గించి పడగ దింపుకుంది. చెన్నకేశవుడు చిరునవ్వు నవ్వాడు. అంతకు పూర్వం జైన దేవాలయం చెన్నకేశవస్వామి ఆలయంగా మార్చబడింది మాచర్లలో. జిల్లేళ్ళు కొట్టించి జొన్నవిత్తులు నాటారు.

మకుట ధారి అయినాడు మలిదేవుడు. మహామంత్రి అయినారు బ్రహ్మనాయనిం వారు మళ్ళీ మాచర్లకు. శక్తివంతమయిన శివనండ్ల కోటగోడల్ని కుంతంతో పొడిచి కళ్యాణపురం రాజుల స్నేహం సంపాదించారు బ్రహ్మన్న.

కళ్యాణపురం ఆడపడుచు సిరమాదేవి ( శ్రీరమాదేవి ) పెద్ద మలిదేవి అర్ధాంగి అయి మాచర్ల మహారాణి అయింది. ఆమె వెంట అరణంగా వచ్చిన గోపాలుర బృందం నాయకుడు గోపన్న అత్యంత బలశాలి. దుండుడుకు వీరుడు.

బ్రహ్మనాయని గామా లయిన భీమన్నను లవలీలగా ఎత్తి గోడా అవతలకు విసరి కొట్టినవాడు గోపన్న. గొట్టిపాళ్ళలో గోవు మందలను మేపుతున్నాడు.

ఆ సమయంలోనే అసలు కథ ప్రారంభమయింది.

శీలము బ్రహ్మన్నకు కళ్యాణపురం రాజుల అండదండలు లభించాయి. దాంతో ఆయనకు కొండంత ధైర్యం వచ్చింది.

రాజకీయ పరిణామాలు చిత్రంగా జరుగుతాయి. కేవలం ఒకసారి సాధారణ విషయం కోళ్ళపోరుగా పరిణమించింది.

మాచర్లకు, గురజాలకు సరిహద్దు గ్రామాలలో ఔత్సాహికులయిన వారు కోళ్ళ పోరు పెట్టుకున్నారు.

అటు పరిసర గ్రామాలు కావటం నించి ఇరు పక్షాల వారూ ఉన్నారు. రెండు పుంజులూ జీవికగే పందెంతో (కత్తులు లేని) పోట్లాడుతున్నాయి.

ఒక కోడి పారిపోతూంది. ఒక దుందుడుకు సైనికుడు "అదిగో బ్రహ్మనాయుడు కోడి పారిపోతూంది" అన్నాడు.

దాంతో అగ్గి కీల లేచింది. విస్ఫులింగ మయిపోయింది. రెండు పక్షాలకూ ఈ వార్తలు తెలిశాయి. పంతాలు, పట్టింపులు రెట్టింపులు అయినాయి.

రాయబారుల ద్వారా కోడిపందాలతో బలాబలాలు తేల్చుకోవాలని నిర్ణయమయింది.

తొలి ఏకాదశినాడు సుముహూర్తం నిర్ణయమయింది.

శీలము బ్రహ్మన పినుగల్లునించి చిట్టిమల్లును రప్పించాడు. నాయకురాలు నల్లమల్లుని సిద్ధం చేసింది.

కోళ్ళు బరిలోకి దిగాయి. అందరూ ఆతురులయి చూస్తూ ఉండగా నాగమ్మ నల్లమల్లు సొమ్మసిల్లిపోయింది.

శీలము బ్రహ్మన్న పకాలున నవ్వినాడు. నలగామరాజు సిగ్గుతో తలదించుకున్నాడు. నాగమ్మ కన్నులు ఎర్రబారాయి.

ఆమె అంతర్యంలోని ఆదిశేషువు పడగవిప్పి బుసకొట్టాడు.

"బ్రహ్మనాయనింగారూ! తొలి పందెం మీది అయింది. కాని, పణంగా ఒడ్డబడ్డది ఏమీ లేదుకదా! ఏదైనా పణంగా ఒడ్డి పందాలు నడుపుకుంటే బలాబలాలు తేలిపోతాయి" అన్నది.

బ్రహ్మన్న విజయోత్సాహంలో ఉన్నాడు.

"అలాగే, నాగమ్మా! ఏమిటి పందెం" అన్నాడు అప్రయత్నంగా, ధర్మరాజు జూదంలో తన సర్వస్వాన్ని ఒడ్డిన విధంగా.

"మలిదేవుడు మాచర్లలో ఉన్నాడుగా, బ్రహ్మనాయుడా! నీ దగ్గరయింది పందెం ఒడ్డేందుకు?" అని ఎత్తిపొడిచింది నాగమ్మ.

"మాచర్లనే పందెం ఒడ్డగలను కావాలంటే."

"మలిదేవుని రాజ్యాన్ని నీవు కోడిపందెంలో ఒడ్డి కోల్పోతావా, బ్రహ్మనాయుడా! నీవు అన్నీ తెలిసినవాడవు. ఇది నీకు ధర్మమా?" అని అడిగింది శివానీ ఎగతాళి పట్టిస్తూ.

తొలి విజయాన్ని చవిచూసిన ఉత్సాహంలో బ్రహ్మనాయుడు ఆవంత పట్టించుకోలేదు.

"మాచర్లను పోగొట్టుకుంటానో, మలిదేవునికి గురజాలను పట్టబెడతానో పందెం ముగిశాక కదా నీకు తెలుస్తుంది?" అంటూ బ్రహ్మనాయుడు నేత్రాలు విశాలం చేశాడు.

"బ్రహ్మనాయుడుంగారూ! ఒక రాజు రాజ్యాన్ని ఒక మహా మంత్రి కోడి పందెంలో ఒడ్డటం ధర్మమేనా? అలాగని ఏ ధర్మశాస్త్రం చెప్పగలదో ధర్మమూర్తి అయిన నీ నోట వెంట వినాలని ఉంది. పందెమే కావాలంటే అందుకు నలగామరాజు సిద్ధంగా ఉన్నారు. వారు మీ సమక్షంలోనే ఉన్నారుగా—అడగండి" అన్నది నాగమ్మ.

పందెం నిశ్చయమయింది.

ఓడిపోయిన వారు రాజ్యం వదలి ఏడేండ్లు అరణ్య వాసం చెయ్యాలి! అందుకు నలగామరాజూ బ్రహ్మన్నా అంగీకరించారు.



జంతు
చిత్రం-వి. నాథ్

నోరూ వాయీ లేని కోళ్ళు కలియబడినాయి. తమ జయాపజయాలమీద రాజు భవితవ్యం ఆధారపడి ఉంటుందని వాటికి తెలియదు. అన్నీ తెలిసిన మనుష్యులే ఏమీ తెలియని వాటి ప్రాణంతో చెలగాటం పెట్టుకున్నారు.

చిట్టిమల్లు శక్తిని కోల్పోయింది. నాగమ్మకోడి నల్లమల్లు ఈ సారి పందెంలో శక్తిని పుంజుకుంది.

కోళ్ళ పోరులో బ్రహ్మన్న పరాభూతు డయినాడు.

ఆ తరవాత పెద్ద యుద్ధం జరిగింది. గోపన్న చనిపోయాడు. తులసితీర్థం గోపన్న గొంతులో పోసి తిలోదకా లిచ్చాడు బ్రహ్మనాయుడు.

"శివానీ! ఎంతపని చేశావు?" అన్నాడు బ్రహ్మన్న. నాయకురాలి నేత్రాలు అరుణిమ దాల్చాయి.

"బ్రహ్మనాయుడా! ఈ పరిణామాలకు కారణం ఎవరంటావు? రాజు సమక్షంలో లేకుండా రాజ్యాన్ని పణంగా ఒడ్డిన ఓడిపోయిన వాడవు నీవు. తప్పు నాయకురాలిదని నీవు అంటే సరిపోతుందా? భావి చరిత్రకారులు నిజాన్ని పూహించలేరా? తొలి పందెంలో నా కోడి ఓడిపోయినప్పుడు యుద్ధం జరగలేదు కదా! మీ కోడి ఓడిపోగానే మీకు రోషాలు వచ్చాయి. యుద్ధం జరిగింది. ఆలోచిస్తే ఎవరికయినా అర్థ మవదా!

తొలి పరాజయాన్ని నేను ధైర్యంగా స్వీకరించాను. నీ పరాజయంతో యుద్ధం ఆరంభ మయింది. అంటే తప్పు ఎవరిదో కాలమే నిరూపిస్తుంది.

ఏది ఏమయినా తక్షణమే నీవు మలిదేవాదులతో కలిసి మాచర్లను వదిలిపోవాలి" అన్నదామె.

బ్రహ్మనాయుడు అవమాన భారంతో మాచర్లకు వచ్చాడు. శీలము బ్రహ్మన్న చేసిన పని గురించి విన్న మలిదేవుడు తమ్ములని ఉమిసి దిగులుపడ్డాడు.

శీలసాని, వంకిసాని, వెన్నెలదేవి గోడుగోడున విలపించారు. మేతకోసం వెళ్ళి మేకలు గుడిబండ తగిలించుకున్నట్లుగా అయిపోయింది.

రాణువనూ, రాణివాసాన్ని, గోపాలకుల్ని, గోపుల మందల్ని ప్రయాణానికి సిద్ధం చేశారు. చివరిసారిగా చెన్నకేశవునికి తోమాల సమర్పించాడు శీలము బ్రహ్మన్న. ఆయన నేత్రాలు అశ్రుతప్త మయినాయి.

'నమ్ముకున్నందుకు మలిదేవాదులకు రాను ఇవ్వ గలిగింది ఏమిటి? అరణ్యవాసమా? చెన్నుడా! ఈ బ్రహ్మన్నకు ఎంతటి అగ్ని పరీక్ష పెట్టావయ్యా' అనుకున్నాడు.

పండాది దిక్కుగా ప్రయాణం ప్రారంభ మయింది. దారిపొడవునా వైష్ణవ బ్రాహ్మణులు ఆయనకు వినయాంజలులు సమర్పించారు. హరిజనులు హారతులు ఇచ్చారు.

"మన శివానీ! పలనాటిని ఉద్ధరించ వచ్చిన పార్వతీదేవి! రెండవసారి జొన్నరాపాల మీద విజయం సాధించింది, దక్షిణాదివారి పరువు ప్రతిష్ఠలు కాపాడింది. దక్షిణాదివారు పాలితులేకాదు పాలకులు కూడా అని శివానీ నిరూపించింది" అంటూ తమ ప్రియతమ నాయకురాలయిన శివానీకి జేజేలు సమర్పించారు పలనాటి ప్రజలు.

(సశేషం)

(కిందటి సంచిక తరువాయి)

## 4

**గురజాల** కోటలో ధర్మ గంట మ్రోగింది.

అప్పుడు సభ జరుగుతోంది. నిండయిన సభ. నాగమ్మ నలగామునికి అల్లంత దూరంలో ఉన్నతాసనం మీద ఆసీనురాలయి ఉంది. రాజకీయ చర్చ జరుగుతోంది.

ధర్మ ఘంట వినిపించటంతో అందరి గుండెలు గుభిల్లు మన్నాయి.

"తక్షణమే ఆ ఘంట మ్రోగించిన వారిని ప్రవేశపెట్టండి" అంది నాగమ్మ.

ధర్మంకోసం ఘంట మ్రోగించిన దీనులు సభా ప్రవేశం చేశారు. వారి శరీరాలు గాయాలతో నిండి ఉన్నాయి.

వారంతా హరిదాసులు. శాంతి జీవనులు. పవిత్ర హరినామ స్మరణలో బ్రతుకును వెళ్ళదీస్తున్నవారు.

శివానీ ఆసనం నించి ఛివాలున లేచింది.

"పుణ్యమూర్తులారా! మిమ్మల్ని ఈ విధంగా హింసించిన వా రెవరు?" అని అడిగింది, బాధ పూరిత స్వరంతో.

"అమ్మా! శివానీ! తప్పిదమయిపోయింది. యాయవారం చేసుకుంటూ మండాదికి వెళ్ళాం. వైష్ణవులయి ఉండి సిగ్గు లేకుండా నాయకురాలి రాజ్యంలో ఎలా ఉంటున్నారని మండాది వారంతా మమ్మల్ని గేలిచేశారు. అవమానించారు. హింసించారు. శీలమా దేవి మా ప్రాణాలను కాపాడి పారిపొమ్మని చెప్పింది. అమ్మా! శివానీ! నీ రాజ్యంలో వైష్ణవులకు తావు లేదా? జీవనం లేదా? రక్షణ లేదా?" అని అడిగారు హరిదాసులు.

నాగమ్మ నేత్రాలు రోష కషాయితాలు అయి యేయి. ఆదినాగేంద్రుడు పడగ విప్పి బుస్సున బుస కొట్టాడు.

"ఏమేమిటా వారి కండ కావరము? ఈ శివానీ హరిభక్తులకు సంరక్షణ ఇవ్వలేనంత కుసంస్కారియా! మత కలహాలను రెచ్చ గొట్టేందుకే కదా వారీ పని చేసినది. మత మంటే మత్తు మందు అని ఈ శివానికి తెలియదా! ఈ పలనాటి ప్రజలను అవమానించిన వారి అంతు చూస్తాను" అన్న దామె.

ఆ వీరావేశాన్ని చూచి నలగాముడు కళవెళ పడ్డాడు.

"నాగమ్మా! నీ వేమి చేయదలిచావు?" అని అడిగాడు రాజు.

"ప్రభూ! మా ప్రజలను అవమానించితే అది మీకు అవమానం కదా! రాజ్యభ్రష్టులయి మండాది పల్లెలో ఉన్న వారు మనను ఏమీ చేయలేక మన ప్రజల్ని కష్టాలపాలు చేస్తున్నారు. చూస్తూ వూరు కోవటం ఎలా? ఈ నాగమ్మ మేధా సంపత్తి ఏమిటో ఇప్పటికే వారు రెండుసార్లు రుచి చూచారు. మలిదేవాదులకు మళ్ళీ బుద్ధిచెప్పిస్తాను. అనుజ్ఞ ఇవ్వండి" అన్న దామె.

నలగాముడు రాజుగా అందుకు అంగీకరించాడు.

నాగమ్మ వీరావేశం తగ్గలేదు.

"అరెరె! పల్నీడా! పరుగున రారా!" అని పిలి రంకె వేసింది నాగమ్మ. అర్ధపీట నించి పల్నీడు పరుగున వచ్చాడు.

"పలనాట పుట్టిన భవానీ! ఎంతకాలానికి నా పేరు పిలిచినావు, తల్లీ! ఏమి ఆజ్ఞ? కన్నమనీడు కులద్రోహి. కన్నమను సున్నం చేయనా! మలిదేవాదుల్ని నలిపేయనా! కొమ్మరాజును పిండికొట్టనా?

శివానీ! భవానీ! నీ ఆజ్ఞ ఔదల దాల్చుతాను, తల్లీ! ఈ వీధుల పల్నీడు నీ బంటు. నీ దాసుడు... దాసానుదాసుడు. ఆజ్ఞ వినిపించు తల్లీ! ఆఘమేఘాల మీద వెళ్ళి వస్తాను" అంటూ వినయాంజలి పట్టి వీరాలాపం చేశాడు వీధుల పల్నీడు.

నాగమ్మ కసిగా బుసకొట్టి కోరగా చూచింది—

"ఒరే పల్నీడా! పలనాటి ప్రజలకు కష్టం వచ్చిందిరా! అవమానాలు జరిగాయి. మండాదిలో తల దాచుకున్న మలిదేవాదులు మళ్ళీ కవ్వించి రిక్క వేస్తున్నారు. పరుగున వెళ్ళి రా రా, పల్నీడా! ప్రతీకారం చెయ్యి. పాము పడగ త్రొక్కారు వారు. కసిగా కాటు వెయ్యరా, పల్నీడా!

గోగ్రహణం చెయ్యరా! అడ్డగించిన వారిని అంతం చెయ్యి" అంటూ రంకె వేసింది నాగమ్మ. మల్లవరం గిత్తలా కోరాడుకోంది నాయకురాలు నాగమ్మ. చెంగనాలు వేస్తోంది.

పల్నీడు పరుగున వెళ్ళాడు. మండాది మీద విరుచుకు పడ్డాడు. కుండపోతగా రక్తధారలు కురిపించాడు.

లంకన్న కన్నమనీడుతో కలిసివస్తే కసిగా కత్తి ఝళిపించాడు. కార్తికేయుడల్లే, కార్తవీర్యార్జును డల్లే పోరాడాడు. లంకన్న ఒరిగిపోయాడు. ఆల మందలు కూడ నష్టమయినాయి.

పలనాటి గోపాలబాలురు ఆలమందల్ని కృష్ణ దాటించి గురజాల వైపుగా పరుగులు తీయించారు. నాగమ్మ లక్ష్యం నెరవేరింది. మలిదేవాదులు మళ్ళీ పరాభూతు లయినారు.

కాని, వీధుల పల్నీడు వీరకిశోరం! ఇంకా పోరాడుతూనే ఉన్నాడు. ఎవరి సహాయమూ లేకుండా ముందుకు చొచ్చుకు పోయే ఎక్కటి వీరుడు...పోరాడుతున్నాడు.

ద్వంద్వ యుద్ధంలో అతన్ని జయించే వారు లేరు. అందునించి దొమ్మీ యుద్ధం ప్రారంభించారు ప్రత్యర్థులు. దొమ్మీ యుద్ధానికి నియమాలుండవు.

ఒక్కడిమీద ఎందరయినా పోరవచ్చు. అభిమన్యుని మీద కౌరవులు చేసిన యుద్ధం అలాంటిదే! అది తప్పని సరి అయినప్పుడు ప్రయోగించే యుద్ధ నీతి. దాన్ని ప్రయోగించారు.

పడమటి ఆకాశం నెత్తుటి మడుగులో జలక మాడుతోంది. ఎర్రగా మండుతున్నాడు సూర్యుడు. ఆకాశమంతా నారింజ పండు రంగులో కెంపులా మెరుస్తోంది. రవి అస్తమించాడు. వీధుల పల్నీడు పదుగురు వీరుల మధ్య ఒరిగిపోయినాడు. విజయలక్ష్మిని చేపట్టిన శివానీ కన్నీరు పెట్టుకుంది.

'శివానీ ! భవానీ !' అంటూ వీరాలాపం చేస్తున్న పల్నీడి మాటలు ఆమె మనస్సుని పట్టి పీడిస్తున్నాయి.

రక్తంతో తడిసిన అతని రూపం కళ్ళముందు కదులాడింది.



# అగ్ని పునీత

ఇల్లాదేవి

'పల్నీడా భస్మరాసి అయినావా? కాలకంఠుడు కలకాలం నీకు ఆత్మశాంతి ఇమ్మగాక!' అని స్మరించిం దామె. అశ్రు తప్త నయనాలతో వీధుల పల్నీడి రూపం మాసిపోయింది.

అలమందులు పోయినాయి. నాగమ్మ గోగ్రహణం చేయించింది. ఈ వార్తలు బ్రహ్మనాయని హృదయంలో ముల్లు నాటాయి.

'ఒక ఆడదానికి ఇంత తెగింపా! అదేమిటో చూస్తాను. గురజాల కోటగోడల్ని కుంతంతో పొడుస్తాను' అని శపథం చేశాడు బ్రహ్మన్న.

తల్లి శీలమ్మ అతన్ని వోదార్చింది.

''కొడుకా! బ్రహ్మ నాయుడా! నీ కింత పంతం దేనికి? పంతానికి పోతే ఆ ఆడదానికే అలుసయిపోతావు. నీవు ఆ ఆడదాని చేతిలో పరా



భూతుడవు కావటం ఇప్పటి కిది మూడోసారి. ఇక నయినా పంతాలు మానుకో! పట్టింపులు సడలించుకో నాయనా!

కొడుకా బ్రహ్మనాయుడా! మళ్ళీ పంతానికి పోయి మళ్ళీ పరాభూతుడవు కాబోకు. నా మాట వినరా, కొడుకా!'' అని దీనాతి దీనంగా గోల గోలున విలపించింది కన్నతల్లి శీలమ్మ. కాని బ్రహ్మన్న వినలేదు. విష్ణుతేజంతో విరాజిల్లుతున్నవాడల్లే ఒంటరిగా యుద్ధానికి బయలుదేరాడు. గురజాల కోట గోడల్ని కుంతంతో పొడవాలని.

ఈ వార్త నాగమ్మకు చేరింది. విరిసిన పువ్వులా ఒక చిరు నవ్వు నవ్విం దామె.

"బ్రహ్మనాయుడుంవారు త్రొక్కిన నేల పవిత్ర మవుతుందని అంటారుకదా! ఇక ఇప్పు డీ పలనాడు పవిత్ర మవుతుంది కాబోలు. ఆ అదృష్టం గురజాలకు కూడ పట్టనుందా?'' అన్న దామె.

నలగాముడు ఆలోచనా మగ్ను డయినాడు.

మండాది పొలిమేరలదాకా వెంట వచ్చింది తల్లి శీలమాంబ. "కొడుకా బ్రహ్మనాయుడా! నీకు కొన్ని నీతులు చెప్తాను... వినరా! నీవు విష్ణుతేజం కలవాడవని విప్రులంతా అనుకుంటున్నారు. అందునించి విప్రుల్ని వధించకు.

తెల్లవారు జామున లేగదూడలు పాలకోసం తల్లి పొదిలో కుమ్ముతుంటాయి. ఆ సమయంలో యుద్ధం చెయ్యకు. అవి భయపడి పారిపోతాయి. ఆ పాపం నీకే అవుతుంది.

కొడుకా బ్రహ్మనాయుడా! విట జంగమునికి ప్రేమాస్పదులయిన జంగమేశ్వరులను యుద్ధంలో చంపకు. నాగభూషణుడు నొచ్చుకుంటారయ్యా!

స్త్రీలను పిల్లల్ని, నిద్రపోయే వారిని చంపకూడదు. అంతఃపురాలలో ఆడదాయిల వెనక దాక్కున్నవారిని, దేవాలయంలో తల దాచుకున్న వారిని చంపకు.

కొడుకా బ్రహ్మనాయుడా! ఇది యుద్ధ నీతి. జ్ఞాపకం పెట్టుకో!'' అని బోధించింది తల్లి శీలమాంబ.

బ్రహ్మనాయుడు ఆ మాతృమూర్తి పవిత్ర పాదపద్మాలకు మ్రొక్కి ఆశీస్సులు పొందాడు.

ప్రొదు పొడిచాక గురజాలకు చేరుకున్నాడు. గురజాలలో ఎనిమిది వేల సైన్యముంది. బ్రహ్మనాయుడు ఒంటరి. అతడు అసహాయశూరుడు. వీరవిక్రముడు. నిజమే! కాని గురజాలలో సైన్యం ఎనిమిదివేలు.

అతని తెగింపుకు అచ్చెరువు పడింది నాగమ్మ. తన సేవలో తురుష్కులు కూడ ఉన్నారు. కనుసన్న చేస్తే కదలి వచ్చేవారు.

కాని శివానీ అలా చెయ్యలేదు. శివధ్యానం చేస్తూ కూర్చుంది. భ్రూమధ్యంలో భవుడు ప్రత్యక్షమయినాడు.

'శివానీ! నీ విరోధి నాయుడు వస్తున్నాడు. అతనిని మట్టుపెట్టేందుకు నీకు మంచి అవకాశం. మవునం వహించావేమి?' అని అడిగాడు.

'ప్రభూ! నటజంగమా! జీవన నాటకంలో నా పాత్రను ఇంత జటిలం చేసినావేమయ్యా! ఇప్పుడు నాయుని మట్టుపెడితే ఏమవుతుంది? విద్వేషంతో ఒంటరివాడని చూడకుండా చంపివేసిందని చరిత్ర నన్ను శపించదా భవా!

ఈశ్వరా! పలనాటి ప్రజల సుగుణాలే నా అలంకారాలు అనుకుంటున్నాను. వారి శ్రేయస్సే నా చరమ లక్ష్యమనుకుంటున్నాను. వారి శ్రేయః కామనతోనే నాయుణ్ణి బయటకు నడిపించాను. కాని అతనిపై నాకు వ్యక్తిగత ద్వేషమేమి? వచ్చినవాడు వచ్చినట్లే వెళ్ళిపోతాడు' అని అంజలి ఘటించిం దామె. భవుడు చిద్విలాసంగా నవ్వాడు.

'వీర కిశోరమయిన నీ బంటు వీధుల పళ్ళీడు ఒంటరిగా వారి చేతిలో మరణించలేదా!' అని ప్రశ్నించాడు.

'త్రిపురాంతకా! దేవదేవా! నన్నింకా పరీక్షించకు. వీధుల పళ్ళీడు అభిమన్యుడల్లే మరణించాడు. నిజమే! వారు తప్పిదం చేశారని నే నెందుకు చెయ్యాలి. ఒక పరాక్రమ శాలిని దొమ్మీ యుద్ధంలో ఓడించడమంటే పరాజయాన్ని అంగీకరించటమేకదా!

ఒక్కొక్కరే పోరి గెలవలేమని చెప్పుకోవటమే

వెలువడింది!

మీ రెంతో కాలంగా ఎదురుచూస్తున్న
ఆంధ్రుల అభిమాన రచయిత్రి
ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి
నవలా వాహినిలో మరో ఉత్తుంగ తరంగం

అనామిక
(డైరెక్ట్ నవల)
వెల రూ.14/-
ఆంధ్రప్రదేశ్‌లోని అన్నిబుక్ షాపులలోనూ దొరకును. లేదా మాకు వ్రాయండి.

ప్రతులకు:
వాహిని పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్, విజయవాడ-520002
ఫోన్: 73686

Bachi

రవి కళాశాల
బ్రాడీపేట, గుంటూరు-2.

గత 25 సంవత్సరముల నుండి విద్యాబోధనలో క్రమశిక్షణ. మంచి ఫలితాలతో సంచలనం కలిగించిన సంస్థ.

మా లేబరేటరీ, లైబ్రరీ ఎన్నో అనుబంధ కళాశాలలకన్న పెద్దది. 10 హాస్టల్సు కలవు. ఇంగ్లీషు, తెలుగు మీడియములలో శిక్షణ.

సమ్మెలు, ఆందోళనలు, ట్యూషన్సు లేకుండా తాపీగా చదువు సాగాలంటే? స్టాండర్డు కావాలంటే? గుర్తుంచుకొనండి.

ప్రతి క్లాసులోనూ సీట్లు పరిమితం. 8, 9, 10, మెట్రిక్, ఇంటర్ క్లాసులకు శిక్షణ. జూన్ 20వ తేదీన ప్రవేశపరీక్ష వుండును.


తల్లిదండ్రుల, విద్యార్థుల కోరికపై ఆగస్టులో జరుగు బ్యాంకు పరీక్షలకు శిక్షణ ఏర్పాటు చేయబడినది.

జూలై 1 నుండి క్లాసులు జరుగును.
వివరములకు ఒక కార్డు వ్రాయండి.

C.V.N. ధన్, M.A.,
డైరెక్టర్.

N.B: పోస్టు గ్రాడ్యుయేట్సు, గ్రాడ్యుయేటు ట్రెయిన్డు టీచర్లు, వార్డెన్లు కావలెను. సామర్థ్యాన్నిబట్టి జీతం. స్వయముగా జూన్ 20న కలవండి.

SUVARNA




కదా! బ్రహ్మనాయుడు అవక్ర పరాక్రమశాలి. అతనికి సరిజోడు గురజాలలో లేడు. వీధుల పల్నీడు ప్రాణాలు కోల్పోయినాడు.

అయినా నేను దొమ్మీ యుద్ధం చేయించను. బ్రహ్మన్న ఎంతమందిని హతమార్చదలుచుకుంటే అంతమందిని హతమార్చనివ్వు. ముక్కంటీ! బ్రహ్మనాయని కిది ఆటవిడుపు' అని బదులిచ్చిందామె. భ్రూమధ్యంనించి భవుడు అంతర్ధానమయినాడు.

శివనామం జపిస్తూ కూర్చుంది శివానీ!

ప్రళయకాల రుద్రుడల్లే గురజాలమీద విరుచుకు పడినాడు బ్రహ్మనాయడన్న వార్తలు ఆమెకు చేరాయి.

"బ్రహ్మనాయుడు సాహసించి ఒక్కడే గురజాలకు వచ్చినాడు. ఒంటరిగా ఎదిరించి అతనితో పోరగల వీరు లెవరైనా పోరండి. దొమ్మీ యుద్ధం చేసేంమకు వీలు కాదు. మలిదేవాదులు వీధుల పల్నీడిని చంపినట్లుగా మనం బ్రహ్మనాయని వధించరాదు. ఇది నా శాసనం" అని ఆదేశించింది శివానీ.

ఆ ఆదేశం విని జోదుల సోముడు, చింతపల్లి రెడ్డివంటి వీరులంతా బ్రహ్మనాయనితో పోరలేమని అంగీకరించి అస్త్రాలను విడిచిపెట్టారు. నాయకురాలి ఆదేశం ప్రకారం దొమ్మీ యుద్ధం చెయ్యకూడదు. ప్రాణాలు దక్కించుకో దలచుకున్న వారు పారిపోయారు.

మిగిలిన వారు కొందరు బ్రహ్మ నాయని కుంతానికి ప్రాణాలు బలి ఇచ్చారు. బ్రహ్మనాయుడు నాగమ్మ సైన్యాలను నలివలి చేశాడు.

ఎదుర్కోలులేని ఈ యుద్ధరీతి గురజాలలోఉన్న ధర్మ మూర్తులయిన బ్రాహ్మణులను కదల్చివేసింది. ధర్మబుద్ధి గలిగిన రెడ్డి కుటుంబాల వారినీ, కాపులనూ వెంటబెట్టుకుని వారు రాయబారం వెళ్ళారు.

బ్రహ్మనాయని ముందు మోకరిల్లారు.

'శ్రీకృష్ణ నిఅపరావతారమయిన బ్రహ్మనాయడా! శాంతించు. నిరాయుధులైన వారి మీద యుద్ధం ధర్మమూర్తి వయిన నీకు తగదయ్యా! శాంతించు" అని ప్రార్థించారు.

నాయడు శాంతించాడు.

నాయకీ నాగమ్మకి శివధ్యానం ముగించింది. గురజాల పుర వీధుల్లో జరుగుతున్న నరమేధం ఆగిపోయింది. బ్రహ్మనాయుడు తిరుగు ప్రయాణమయినాడు.

దారిలో మేడపిలో ఆగి కొన్ని గ్రామాలు పన్నెండు వేలకు కౌలుకు తీసుకున్నాడు. మండాది వెళ్ళాక అందరికీ ఈ వార్త చెప్పారు. మండాదిని విడిచి మేడపి వచ్చేందుకు సిద్ధమయ్యారు.

రాచమల్లు (మలిదేవుడు) ససైన్యంగా కదిలి వచ్చాడు. కళ్యాణపురం కొమ్మరాజు భీష్మాచార్యుని వంటివాడు. బాలచంద్రుని తండ్రి. అతని రాకతో మేడపి వీర మేడపి అయింది.

రాచమల్లుకు రవంత ధైర్యం వచ్చింది.

నాయకురాలు ఆ పైన రాచమల్లు సంగతి మర్చిపోయింది. దేశ నిర్మాణం మీద ఆమె మనసు లగ్నమయింది. వివిధ దేశాల వారితో బాంధవ్యాలను పెంచుకుంది. తురుష్కులు సైతం మిత్రులయినారు.

అంగ, వంగ, కళింగ, కాశ్మీర, కాంభోజ, చోళ, పాంచాల, బర్బర, కురు, బాహ్లిక, కేకయ, మత్స్య, మాళవ, మగధ, గాంధార...ఇత్యాది ఛప్పన్నారు దేశాలతో మైత్రిని సాధించిందామె.

దేశం సుసంపన్నం అయింది. చంద్రవంక, నాగులేరు పొంగి ప్రవహించినాయి. పంటలు సస్యశ్యామలమయినాయి. శివానీ మనసులో శాంతి సుస్థిరమై నిలిచింది.

గురజాలకు కేవలం నాలుగు క్రోసుల దూరంలో ఉన్న పుట్టినింటికి వెళ్ళలేదామె. మహామంత్రిణి అయాక చౌదరి రామిరెడ్డి చనువుగా వచ్చి మాట్లాడి ఎరుగడు.

శాంతి సుస్థిరతలు సమకూరాక రవంత విశ్రాంతి దొరకగానే ఆమెకు ఒక్కసారి పుట్టినింటికి వెళ్ళి రావాలన్న ఆలోచన వచ్చింది. ఒకసారి తన ప్రజలను పలకరించుకున్నట్లు అవుతుందన్న ఆలోచనతో బయలుదేరిందామె.

మహా మంత్రిణి బయలుదేరుతున్న వేళ రుంజలు రుద్ర వీణలు చెలరేగి మ్రోగినాయి. ముణుకులు కణకణలాడినాయి. గురజాల కోటగోడలు భేరిభాంకారాలతో దద్దరిల్లినాయి. ఏనుగుమీద హవుదా కట్టి సర్వాలంకారాలు చేశారు. వీడ్కోలుగా సైనికులు విన్యాసాలు చేశారు. కాసె మీద కాసె బిగించికట్టింది శివానీ. భస్మవర్ణం కంచి హాం బట్టు కంచుకం తొడిగింది. ధర్మ దండాన్ని చేత పట్టుకుంది. నడుం పటకాలో వీర ఖడ్గం బిగించుకుంది. శరీరాన్ని అలముకున్న భస్మధూళి సర్వాలంకార ప్రియమై శోభాయమానంగా ఉంది.

పవిత్ర ముఖ వర్చస్సుతో జిట్టిగామాలపాడు దిక్కుగా ప్రయాణం సాగించింది. ఏనుగు మీద హవుదాలో శివాని భవానిలా విరాజిల్లుతోంది.

జిట్టిగామాలపాడులో హవుదా దిగి ఇంత ధూళి తీసుకుని శిరస్సున ఉంచుకుందామె. నాగులేటిలో పాద ప్రక్షాళనం చేసి దాహం తీర్చుకుంది. పురజనులంతా పరుగున ఎదురొచ్చి స్వాగతం పలికారు. కళ్ళనిండుగా శివానిని చూసుకున్నారు.

పలనాటి పార్వతి, పలనాటి ప్రజల ఆశాకిరణం అయిన ఆమెకు హారతు లిచ్చారు. చూతపల్లి బుక్కాయి చల్లారు.

వేడుకలు జరుపుకున్నారు. జెట్టీలు సాము గరిడీలు చేశారు. చౌదరి రామిరెడ్డి దంపతులకు కన్నుల పండుగ అయింది. పసుపుకొమ్ములా సన్నగా ఉండే ఆ నాటి నాగంద్దేవి. భర్త వియోగంతో ఆశలన్నీ అణగారి మవునంగా, దిగులు మూట కట్టినట్టుగా కన్పించిన ఆ నాటి శివానీ...ఆమేనా ఈమె!

కన్న కడుపుకు ఇంతకన్నా పండుగ ఏముంటుంది. పలనాటి పార్వతిగా, ప్రభువులకు మార్గదర్శిగా ఎంత పేరు ప్రతిష్ఠలు సంపాదించుకుంది.

వారి కన్నులు ఆనంద అశ్రుతప్తాలయినాయి.

"అమ్మా! శివానీ! మా బ్రతుకులు అర్థవంతం చేశావు తల్లీ! నిన్ను కన్నందుకు పదుగురిలో గర్వంగా తలెత్తుకు తిరిగేలా చేశావు" అంటూ ఆమెను అక్కున చేర్చుకుని ఆదరించారు.

"భావానీ! శివానీ!" అంటూ ప్రజలు జేజేలు పలికారు.

"అమ్మా! నవమాసాలు మోసి జన్మ నిచ్చావు. స్తన్యమిచ్చి తొలిసారి నా ఆకలి చల్లార్చినావు. నాదొక కోరిక. తీర్చుతావా?" అని అడిగింది శివానీ తల్లిని.

"ఏమిటమ్మా అది...?" తల్లి ఆమెను చనువుగా చిన్న పిల్లను తీసుకున్నట్టు అక్కున చేర్చుకుంటూ అడిగింది.

"రాజకీయాలలో ఏ వ్యక్తికీ ఏ పదవికీ స్థిరత్వం ఉండదు. ఈ వేళ మహా మంత్రిణిగా నీ ముందు నిలిచిన నీ కన్న బిడ్డ శివానీ—రేపు బందీ కావచ్చు. విగతజీవి కావచ్చు. పరాభూతురాలు కావచ్చు. జయమనేది ఎప్పుడు ఒక్కరినే వరించదు— అది రాజకీయాలకు ఆనవాయితీ!

ఒకవేళ ఎప్పుడయినా ఈ పలనాటి ప్రజలకోసం, నా ప్రభువుకోసం నా ప్రాణాలను పణంగా ఒడ్డ వలసిన స్థితి రావచ్చు. అప్పుడు నీ శివానీకోసం నువ్వు కన్నీరుపెట్టనని మాట ఇవ్వు!'' అని అడిగింది శివానీ.

చిత్రమయిన ఆ కోర్కె విని తల్లి తల్లడిల్లి పోయింది. 'అమ్మా! ఆనందంగా పండుగ జరుపు కుంటున్నవేళ ఈ మాట లేమిటి?'' అని అడిగింది రుద్ధ స్వరంతో.

'నిజ మెప్పుడూ నిష్ఠూరంగానే ఉంటుం దమ్మా! ఈ బాధను నీవు భరించక తప్పదు, ఇటువంటి బిడ్డను కన్నందుకు. అమ్మా ! నీచేతి అన్నం తిని ఎన్నో యుగాలు గడచినట్లుగా ఉంది'' అన్నది శివానీ.

తల్లి చివాలున లేచింది.

మల్లెపువ్వుల్లా కన్పించే మొక్క జొన్నలు దంచి వండిన అన్నం వేడివేడిగా వెండి పళ్ళెంలో వడ్డిం చింది. కనుమరుగు చేసి కంచంనిండా క్షీరం పోసింది. పాల బువ్వతో నిండిన వెండికంచం మచ్చలేని పూర్ణ చంద్రుడల్లే కన్పిస్తోంది.

చాలరోజుల తరువాత అలజడులు, ఆవేశాలు ప్రక్కనపెట్టి ప్రశాంత చిత్తంతో తల్లి పెట్టిన అన్నం తిన్నది శివానీ. తృప్తిగా తిని ''ఇంక చాలమ్మా!'' అంటూ లేచింది.

అప్పటికే పురప్రముఖులు, కుల పెద్దలు చాలమంది వచ్చి ఆమె దర్శనంకోసం ఎదురు చూస్తున్నారన్న వార్త వచ్చింది. తల్లి పాదాలకు మ్రొక్కి రాచకీయ చర్చలలో పాల్గొనేందుకు వెళ్ళిపోయింది నాగమ్మ.

ఆమె అవతలకు పోయాక తల్లి బొగిరి బొగిరి ఏడ్చింది.

## 5

గురజాల సభలో పండిత గోష్ఠి జరుగుతూ వుండగా వేగు వచ్చింది. నాగమ్మ లేచి రహస్య మందిరానికి వెళ్ళిపోయింది.

వేగువారు నాయకురాలికి వినయాంజలి ఘటించారు.

'ఏమిటి—?' అన్నటు గా కనుసన్న చేసిం దామె.

'వీరమేడపినించి రాయబారం వస్తోంది.' వేగులు చెప్పారు.

'రాయబారమా? రాయబారి ఎవరు?'

'అల్లుడుగారయిన అలరాజుగారు.'


'ఓహో! బ్రహ్మనాయునింవారు ఈసారి తంత్రం మార్చినారన్నమాట—మన వ్రేలుతో మన' కన్ను పొడవాలని కాబోలు. రాయబారం ఏమని?' అని అడిగింది నాగమ్మ.

'బహుశా రాజ్యభాగంకోసమే అయి వుండాలి' అని బదులిచ్చారు వేగులు.

శివానీ భృకుటి ముడిపడింది.

ఆమె మనసు అశుభాన్ని శంకించింది. 'రాజ్య కాంక్షతో రాచమల్లు విచక్షణ కోల్పోయినాడు' అనుకుం దామె.

'మీరు వెళ్ళవచ్చు' అని వారిని పంపివేసింది. రాజును రహస్య ఆలోచనా మందిరానికి రావల




సిందిగా కబురు పంపింది. నలగాముడు వచ్చాడు. వారి మధ్య చాలసేపు చర్చలు నడిచాయి. ఖిన్ను డయిన నలగామునికి ధైర్యం చెప్పింది నాగమ్మ.

'రాయబారం పంపిన రాచమల్లు నా తమ్ముడు. రాయబారిగా వస్తున్నది నా అల్లుడు. నాయకు రాలా! నా కేమిటి దారి?' అని అడిగాడు ప్రభువు దీనంగా.

'రాజా ! కాలం దురతి క్రమమయినది. రాజ కీయాలలో బంధుత్వాలకు తావులేదు. పలనాటి ప్రజల శ్రేయఃకామనకై ఆలోచించటమే మన కర్తవ్యం. హృదయ దౌర్బల్యం క్షుద్రమయినది. దానిని విసర్జించు, రాజా! ప్రజ్ఞావాదులయినవారు శోకించదగనివానికై శోకించరాదు.

ప్రభూ! తప్పు చేయటానికి భయపడాలి. కాని అన్యాయ మనుకున్న దానిని ఎదిరించ నికి భయమెందుకు. జరగవలసింది జరుగుతుందికదా!' అని బదులిచ్చింది శివానీ!

నలగాముడు కర్తవ్యానికి బద్ధుడయి బంధు త్వాపేక్షను వదలుకున్నాడు. మనసు కుదుట పడింది.

'శివానీ ! ఈ విషయంలో నా మనసు మొద్దు వారిపోయింది. చేయవలసింది ఏమిటో నీవే ఆలోచించి నిర్ణయించు' అన్నా రాయన.

పగడ పూవుల్లాంటి నాగమ్మ పెదవుల మధ్య నించి మల్లె పూవులాంటి మందహాసం జారిపడింది. 'ప్రభూ ! లయినవారి మధ్య అంతరాలు సృష్టించింది నాగమ్మ అని లోకం నన్ను ఆడి పోసుకుంటుంది. ఈ బాధ్యత నేను తీసుకున్నందు వల్ల వచ్చే అపప్రధ అంతా నా వంతు అవుతుంది. గరళాన్ని గొంతులో దాచిన కాలకంటుడే నాకు దిక్కు. పలనాటి ప్రజలకోసం ఈ బాధ్యతను నామీద వేసుకుంటున్నాను.' అని చెప్పి శలవు తీసుకుని వెళ్ళిపోయిం దామె.

ఆ రాత్రి ఆమె కళ్ళముందు పేరమాదేవి రూపం కదలాడింది. సినిసు. ౦. కొత్త మాయని పెళ్ళికూతురు. భర్త ఒకవంక తాను ఒకవంక అంటపోయినారు.

ఈ పొరపొచ్చాలు ఎప్పుడు పోతాయా? భర్తతో కలిసి సుఖంగా జీవించే రోజులు ఎప్పుడొస్తాయా అని ఎదురు చూస్తోంది. పాపం ! కాని, ఈసారి బ్రహ్మనాయుడు కొత్త పన్నుగడ వేశాడు. ఇది ఏ పరిణామాలకు దారి తీస్తుందో మరి. వేగు చుక్క పొడిచేదాకా శివానీ మేలుకునే ఉంది. నేత్రాలు అగ్నిగోళాలు అయినాయి.

తెల్లవారకముందునించీ అలరాజు రాకకోసం ఎదురు చూడసాగిం దామె. తెల్లవారాక అలరాజ గురజాల వచ్చినాడన్న వార్త వచ్చింది.

కన్నీరు తుడుచుకుని కర్తవ్యానికి నిలిచిం దామె.

సభా ప్రాంగణం కిటకిటలాడుతోంది. నంబి వారు, తంబళ్ళవారు, రెడ్డివారు, కాపువారు, కమ్మవారు, హరిజనులు, గిరిజనులు, ఆటవికులు వేలాదిగా సభలో ఉన్నారు.

అంతనా తల పూవు రాలిపడిన చప్పుడు విని పించేంత నిశ్శబ్దం. అందరూ ఆత్రతతో నాయకురాలి ముఖం చూస్తున్నారు.

శివానీ తల దింపుకుని శివనామం చేస్తోంది.

అలరాజుకు రాయబారిగా జరుగవలసిన మర్యాద లన్నీ జరిగాయి.

'అల్లుడా!' అని మనసులోపలే ఆక్రోశించాడు రాజు.

''రాయబారీ! నీ రాయబారం ఏమని— ?'' శివధ్యానం చాలించి అడిగింది నాయకురాలు నాగమ్మ.

''రాచమల్లు (పెద్దమలి దేవుడు ) ఏడున్నర సంవత్సరాలు రాజ్యం వదలి నానా అవస్థలు పడ్డాడు కదా నాగమ్మా ! కళ్ళ పొరలో అనుకున్న గడువు తీరిపోయింది.

ధర్మరాజు పద్నాలుగేళ్ళు అరణ్యవాసం చేశాడు. బ్రహ్మనాయుడు ఏడేండ్లు చేశాడు. ఇప్పుడు మరల మాచర్ల రాచమల్లుకు దక్కాలికదా !

వెంటనే వారి దాయభాగం వారికి రావాలి'' అన్నాడు అలరాజు గంభీరంగా.

''అలరాజా! నిన్ను పంపింది ఎవరు?''

''రాచమల్లు'' అని బదులిచ్చాడు సమయం తెలిసిన అలరాజు.

''వారికున్న రాజ్యార్హత ఏమిటో వివరించ గలరా మీరు?'' అని అడిగింది నాగమ్మ.

సభికుల నేత్రాల అవిమేషాలు అయినాయి.

''నాగమ్మా!''

''నేను మహామంత్రిని.''

''మహామంత్రిణీ! వారికున్న రాజ్యార్హత ఏమిటో నీకు తెలియదా? అనుగు రాజు అగ్రభార్య తనూ భవులు వారు. ఆనాడు నీవే పంచియిచ్చావుకాదా!'' అన్నాడు అలరాజు.

''ఆనాడు పంచి ఇచ్చినది దాయభాగం కాదయ్యా. అది దయాభాగం మాత్రమే!'' అన్నది శివానీ.

''అది ఏ భాగమయినా గడువు ముగిశాక వారి రాజ్యం వారికి రావద్దా?'' అని అడిగాడు అలరాజు.

''గడువు ముగిసింది అరణ్య వాసానికే కాని రాజ్యార్హతకు కాదు. శ్రీకృష్ణుని అవరావతారం కదా శీలము బ్రహ్మన్న—వారికి బాధ్యత తెలియదా! భారతం తెలియదా!

మరొక కురుక్షేత్రానికి ఇది నాందీవాచకమా!'' అన్నది శివానీ.

ఆ మాటలు వింటున్న నలగామuni మనసు వ్యాకులత మయింది. కన్నులు చెమరించినాయి.

''అంటే గురజాలవారి అభిప్రాయం రాచమల్లుకు రాజ్యార్హత లేదనేకదా!'' అని ఖండితంగా అడిగాడు అలరాజు.

నాయకురాలు అతనివంక ప్రశంసాపూర్వకంగా చూచింది. రాయబారి కుండవలసిన నేర్పు అతని కుంది.

''అలరాజా! ఇది గురజాలవారి అభిప్రాయం కాదు. ధర్మవిదులయిన వారందరి అభిప్రాయం. నీవే ఆలోచించు.

ఒకవేళ వారికి రాజ్యార్హత ఉన్నదనే ఒప్పుకున్నా ఇప్పుడు రాజ్యం వారికి దక్కదు. ఒక తండ్రి కొడుకు లిద్దరు ఆస్తిని సమంగా పంచుకున్నారు. చిన్నవాడు తన భాగాన్ని జూదంలో కోల్పోయాడు. అది మళ్ళీ అతనికి దక్కాలని వాదించటం ఏమిటి?

ఏ ధర్మశాస్త్రం ఈ వాదాన్ని సమర్థిస్తుంది. చెప్పు అలరాజా!'' అన్నది శివానీ.

అలరాజు రవంతసేపు మౌనం వహించాడు.

''అన్నదమ్ముల మధ్య పొరపొచ్చాలు మాసి పోవడం నీకు ఇష్టంలేదా?'' అన్నాడు చివరి కెలాగో గొంతు పెగుల్చుకుని.


''మనం మాట్లాడుతున్నది పొరపొచ్చాల సంగతి కాదు. రాజ్యార్హత రాచమల్లుకు ఉన్నదా? లేదా? అని. ఆ విషయమై నీవు చెప్పగలిగింది ఇంకో ఏమైనా ఉన్నదా?'' అని అడింగి దామె.

అలరాజు ఖిన్నుడయినాడు. అతని హృదయం వ్రయ్యలయింది. అక్కరకు వస్తుందనుకున్న బంధుత్వాన్ని ఆలోచించిన వా రెవరూ లేరు. నల గాముడు మౌనాలంకారు డయినాడు.

''నాగమ్మా! నేను చెప్పగలిగింది ఒక్కటే—నీవు గురజాల కోటలో కాలుపెట్టాక అనుగురాజు బిడ్డలు తగవులాడుకోవటం ప్రారంభించారు. శీవలు బ్రహ్మన్న శ్రీకృష్ణుడు. ధర్మకోవిదుడు. అతడికి కోపం వచ్చినప్పుడు ఏం జరుగుతుందో నీకూ తెలుసు. అలనాడు సిరమాదేవి పెళ్ళికోసం శివవండ్ల కోటను జయించాడు. ఒకనాడు పలనాడు రాజధాని అయిన గురజాలవిూదికి వస్తే నిర్భయ్యద్ధ సంధి ప్రకటించి వస్తున్నావు.

కృష్ణుని అపరావతారుడయిన శీలము బ్రహ్మన్నకు కోపంవస్తే నీ వేమవుతావో ఆలోచించుకో. నక్కలా చేరి దుర్బోధలు చేశావు. నలగాముడు నీ మాటలకు తలవంచాడు. అతని ప్రాణాలకు ఎసరుపెట్టకు.

మలిదేవాదులకు అన్నగారంటే గౌరవం. నల గామునికి ఇప్పటికీ శీలము బ్రహ్మన్న అంటే పితృభక్తి. ఎందుకు వీరి మధ్య బొడ్డుపోతు




రాజులా నీవు అడ్డు నిలుస్తావు?'' అని అడిగాడు అలరాజు రోషం నిండిన స్వరంతో.

''అలరాజా! ఆగాగు. ఆగవయ్యా! అన్న దమ్ముల మధ్య పొరపొచ్చాలు లేవు. శీలము బ్రహ్మన్న అందరికీ పితృసముడే. అందునించి ఏం జరుగు తున్నా చేతులు ముడుచుకుని కూర్చోవా లంటావా?

పలనాడంటే శీలము బ్రహ్మన్న కాదు. పలనా డంటే నలగామ రాజు కాదు. పలనాడంటే రాచమల్లు కాదు. పలనాడంటే ప్రజలయ్యా పిచ్చి అలరాజా!

వారికి ఆలోచన లున్నాయి. ఆశ లున్నాయి. ఆ ఆలోచనలకు, ఆశలకు అనుగుణంగా శీలము బ్రహ్మన్న అయినా, రా చమల్లు అయినా, నలగాము డయినా, నేను అయినా నడుచుకోవాలి.

నీవు ప్రభువుల సంగతి చెబుతున్నావు. నేను ప్రజల సంగతి చెబుతున్నాను. పిచ్చి అలరాజా! రాజుల ప్రతిష్ఠ కోసం రాజ్యాలు పతనం కాకూడదయ్యా!'' అన్నది నాగమ్మ.

అలరాజుకు ఒళ్ళంతా కారం రాచుకున్నట్టు అయింది.

''పలనాటి ప్రజలు ఏమని కోరుతున్నారు?'' అని అడిగాడు అక్కసుగా.

''మైలమాదేవి పసుపు కుంకాల కింద వచ్చిన పలనాటిని మైలమాదేవి సుతుడే పాలించాలి. అనుగు రాజు సంతానంలో అందరి కన్నా పెద్దవాడు కనక నలగాముడే పలనాటిని పాలించాలి. రాచమల్లు (మలి దేవుడు) ఉత్తరాది వారింటి ఆడపడుచు గర్భ వాసాన జన్మించాడు.

ఉత్తరాది (కళ్యాణపురం) వారింటి ఆడ పడుచును పెళ్ళి చేసుకున్నాడు. దక్షిణాది ప్రజలకు ప్రభువు అయే అవకాశం ముందు అతనిది కాదు—నలగామునిది.

పలనాటి ప్రజల కోర్కె ఇది. ఈ కోర్కె ధర్మ బద్ధమయినది కాదని ధర్మమూర్తి అయిన బ్రహ్మన్న చెప్పగలరా? బ్రహ్మన్నగారే కాదు. ఏ ధర్మశాస్త్ర మయినా చెప్పగలదా!

బదులు పలుకవేమయ్యా, అలరాజా!'' అని అడి గింది నాగమ్మ.

అలరాజు ఖిన్ను డయినాడు. నోరు పెగల లేదు. రాయబారం విఫల మవుతూందన్న బాధతో కుమిలి పోయినా డతడు.

''నాగమ్మా! తర్కంలో నీవు ఉద్దండపిండానివే... కాదనను. నన్ను ఓడించావని చంకలు గుద్దుకోకు. ఆడదానివని ఆలోచిస్తున్నాను కాని లేకపోతే ఈ క్షణంలోనే నీ ప్రాణా లు తియ్యగలను'' అన్నాడు కోపవివశుడయి.

''పలనాటి కోసం ప్రాణా లిచ్చేందుకు సర్వదా సంసిద్ధంగా ఉన్నాను, అలరాజా! కాని, ఆ పని చేయ గలిగిన వాడవు నీవు కాదు. నాతో పంతగించి బ్రహ్మ నాయుడు ఇప్పటికి మూడు సార్లు పరాభూతు

డయినాడు. ఇంక నీ నేను చేయగలవు.

వెళ్ళి నిన్ను పంపిన వారితో చెప్పు!

ఇదివరకు దాయభాగం కోసం చేయి చాపితే దయాభాగం కొంత ఇచ్చాము. దాన్ని వారు జూద మాడి వోడినారు. మళ్ళీ కావాలంటే దయాభాగం కూడా ఇవ్వము. పలనాటి సీమలో సూదిమొన మోపి నంత చోటు కయినా వారు ప్రభువులు కారు. కాలేరు. ఇది మా సమాధానంగా రాచమల్లుతో చెప్పు. విజ్జల దేవికి, శీలమాంబకు, ఐతాంబకు నా ప్రణతులు అర్పించావని చెప్పు'' అన్నది నాగమ్మ.

కోప వివశుడయి అలరాజు నానా దుర్భాష వాడాడు. నాగమ్మను అలరాజు నిందించినా డన్న వార్త పలనాటిలో వీరశైవులందరికీ తెలిసింది. ప్రచండ ఫాలనేత్రం భగ్గున రెప్ప విప్పుకుంది. ఫణిభూషణులు బుస్సున లేచాయి. వీరశైవులు ఎర్రగా మిర్రి మిర్రి చూచారు అలరాజు వంక.

ఆ వీరశైవులలో తంబళ్ళ జియ్యరు ప్రముఖుడు. అతని నివాసం చెర్లగుడిపాడు. భగ్గున మండి పడ్డాడు. ''శివా! భవా! ఎంత అపచారం జరిగింది. ఒక వైష్ణవుడు పార్వతీదేవి అపరావతార మయిన నాగలదేవిని నిందించటమా?

శివానీయే కదా పలనాట పుట్టిన భవానీ!

జై శంకరా! జటా కటాహనిటల్లలాటా! శివ నింద చేసిన ఆ వైష్ణవుని ప్రాణాలు నీకు నైవేద్యంగా అర్పిస్తాను. వాని పంచప్రాణాలు తోరణంగా కట్టి నటజంగమునికి తోమాలగా సమర్పిస్తాను'' అని భయంకరమయిన ప్రతిజ్ఞ చేశాడు వీరశైవుడు తంబళ్ళ జియ్యరు.

చర్లగుడిపాడు గజగజ లాడింది. ఆ రాత్రికి అలరాజు ఆ గ్రామంలోనే బస చేశాడు. అశువులు కోల్పోయాడు.

## 6

తన కుమారుడు అలరాజు మరణవార్త విన్నాడు కల్యాణపురం కొమ్మరాజు. అతడు భారతికిలో భీష్మా చార్యునివంటివాడు. బ్రహ్మనాయుడు —''నా బిడ్డ బాలచంద్రుడు నీ బిడ్డగా స్వీకరించు కొమ్మ రాజా! బిడ్డలు లేరని పరితపించకు'' అని ఓదార్చాడు.

దీర గంభీర మూర్తి అయిన కొమ్మరాజు పెదవులు విచ్చుకున్నాయి.

''యుద్ధం అనివార్యం'' అన్నా రాయన.

వీరమేడపిలో ముణుకులు, రుంజలు, రుద్ర వీణలు, తాళాలు, తప్పెట్లు, చౌకట్లు చెలరేగి మోగినాయి.

నాగులేటి ఒడ్డున కార్యమ పూడి రణక్షేత్ర మయింది. అదే కురుక్షేత్రమయింది.

సర్వసైన్యాలుమోహరించినాయి. శీలమ్మబ్రహ్మన్న అష్టాక్షరి జపిస్తున్నాడునిర్వారామంగా—''ఓం నమో నారాయణయ.''

శివానీ పంచాక్షరి జపిస్తుంది నిర్విరామంగా— ''ఓం నమశ్శివాయ''.

నలగాముడు చివరి ఆశగానాగమ్మ దగ్గరకు వచ్చాడు.

''నాగలదేవీ! ఇప్పు డీ యుద్ధం దాయభాగం కోసమా? అలరాజు మరణించినందుకా?'' అని అడిగాడు.

''నలగామరాజా! స్వార్థమే యుద్ధానికి నాంది'' అన్నది నాగమ్మ.


''నాగలదేవీ! నా దొక కోరిక. రాచమల్లు నా సోదరుడు. బ్రహ్మన నాయుడు నాకు పితృతుల్యుడు. శిరమాదేవి నా మరదలు. కొమ్మరాజు వియ్యంకుడు. పేరిందేవి నా తనూజ. నా స్వార్థం కోసం వీరిలో ఎవరిని యుద్ధానికి బలి చెయ్యను'' అన్నాడు.

నాగలదేవి మనసులో విరక్తిగా నవ్వుకుంది. పైకి అంది—

''రాజా! వారు నా వారు, వీరు నా వారు అనుకుం టున్నావు. నిజమే! కాదని నేను అనను.

కాని ఈ రాజ పదవి నీ కిచ్చిన పలనాటి ప్రజలు ఎవరయ్యా? నీ వారు కారా! బంధుత్వాలు చూచు కుంటావా? ప్రజల యోగక్షేమాలు చూస్తావా? చెప్పు నలగామ రాజా?

ధర్మం తప్పి దాయభాగం అడగటం ఒక తప్పు. ఇవ్వనంటే యుద్ధం చేస్తాననటం మరొక తప్పు.




పలనాటి ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా తాము రాజులు కావా లనుకోవటం పెద్ద తప్పు.

ధర్మం నీ పక్షాన ఉంది. ప్రజలు నీ పక్షాన ఉన్నారు. హృదయ దౌర్బల్యం క్షుద్రమయినది. ఉత్తిష్ఠ నగలగామ రాజా! శోకింప దగని వాటిని గురించి శోకింపకు.

ఏ సమయంలో ఏ ఆలోచన చెయ్యవచ్చునో తెలుసుకోవయ్యా రాజా! అదే రాజనీతి. ఉత్తిష్ఠ! ప్రభు, మంత్ర శక్తులు నీ సొత్తు!'' అని బోధించింది నాగమ్మ.

నలగామ రాజా మోహ విముక్తుడయిన కౌంతే యునిలా అయినాడు. యుద్ధం ప్రారంభించబోయే ముందు కడసారి రాయబారాలు నడుపుకోవటం లాంచన పూర్వకమయిన ఆనవాయితీ!

ఆ లాంచన తీర్చుకుందుకు నాగమ్మ చింతపల్లి రెడ్డిని రాయబారం పంపింది. చింతపల్లి రెడ్డి మేధావి. ప్రజ్ఞాశాలి.

నాగులేటికి అవతల ఔత్తరాహుల మధ్యతు దారులయిన వైష్ణవ సేన బారులు తీరి నిలిచి ఉంది. ఇవతల దాక్షిణాత్యుల మధ్యతు దారులయిన శివసేవ నిలిచి ఉంది.

మధ్యలో చింతపల్లి రెడ్డి కడసారి రాయబారం వెళ్ళాడు.

''బ్రహ్మనాయుడా! అభివందనా లయ్యా! ఎందు కీ యుద్ధం! దాయభాగం అడిగే అవకాశం రాచమల్లుకు లేదుకదా? అలరాజు మరణం వల్ల కన్నం దుకు కొమ్మరాజు ఎంత బాధపడ్డాడో, పిల్ల నిచ్చు కున్నందుకు నలగాముడూ అంతే బాధపడ్డాడు.

పలనాటి ప్రజల యోగక్షేమాల కోసం నీవు సంధికి ఒప్పుకో! మలిదేవాదుల్ని రాజుల్ని చెయ్యటమే కదా నీ ప్రతిజ్ఞ.

మాచర్ల కాకపోతే మరొక వూరు ఏలించుకో! నాగల దేవికి నచ్చచెప్పే భారం నాది. మలిదేవుడు మకుటధారి అవుతాడు కనుక నీ ప్రతిజ్ఞ నెరవేరు తుంది.

దాయభాగం ఇవ్వనన్న నలగాముని పట్టుదల సడల్లుతుంది. యుద్ధం వల్ల అనేక కష్టనష్టాలు ఎదురవుతాయి కదా! ఇప్పటికి ఈ మధ్యేమార్గంలో పోదాం'' అని నచ్చ చెప్పాడు చింతపల్లిరెడ్డి.

చిత్రమయిన రీతిలో తుది క్షణాలలో సంధి కుదిరింది.

బ్రహ్మనాయుడు నాగమ్మలకు ఈ చింతపల్లి రెడ్డి ప్రజ్ఞా పూర్వకమయిన ప్రతిపాదన నచ్చింది.

ఇద్దరూ ఒప్పుకున్నారు.

సాంప్రదాయం ప్రకారం రణ రంగంలో సంధి కుదిరితే రెండు పక్షాల సైన్యాలూ సహ పంక్తి భోజనం చెయ్యాలి.

సైనికులందరూ సహ పంక్తిలో కూర్చుని భోజ నాలు చేస్తున్నారు. కాని విధి బలీయమైనది.

ఆ సహపంక్తి భోజనాలు పూర్తి అయి ఎవరి దారిన వారు పోతే ఇంక పలనాటి చరిత్రను పాడుకునే వారెవరు?

పంక్తి భోజనాల మధ్యకు రాకాసిలా వచ్చి పడింది మాడచి.

ఆమె వీర మేడపివించి సైన్యాలకు ఆహార పదార్థాలు తెచ్చింది. వాటితోపాటు పిడుగుపాటులాంటి మరొక వార్త కూడ తెచ్చింది.

బాలచంద్రుని కూరిమి నెచ్చెలికాడు అనపోతు మరణించాడు. యుద్ధరంగానికి రావద్దన్నందుకు అవమానంతో ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోతూ అందె బిరుదూ, వీర జందెమూ వాడచికి ఆనవాలుగా ఇచ్చి బాలచంద్రునికి పంపాడు.

ఈ వార్త విని బాలచంద్రుడు శివమెక్కించుకున్నాడు. స్నేహితుడు చనిపోయినాడన్న బాధతో ఉచితానుచితాలు మరిచిపోయినాడు. "అసలు ఇదంతా జరగటానికి ఆ నాయకురాలి ఆ దుష్టచింతనే కారణం. ఈ పలనాటికి శకునిలాగా దాపురించింది. ఆమె తలను నేలమీద కందుకంలా దొర్లిస్తాను" అని వీరాలాపం చేశాడు.

సహ పంక్తిలో కూర్చుని భోజనం చేస్తున్న శివాని సేనలు ఆ మాటలు విని పంక్తిని వదలి విరసనగా వెళ్ళిపోయాయి.




శివాని ఈ వార్తలు విని నవ్వింది.

"అనపోతును యుద్ధానికి రావద్దన్నది బాలచంద్రుడు. ఆ అవమానం భరించలేక అనపోతు ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు ఈ నాగమ్మను నిందిస్తాడా బాలచంద్రుడు?

అత డంటే ఉచితానుచితాలు ఆలోచించలేని దుడుకు కుర్రాడు. పెద్ద లయినా—ఇది నీ తప్పు అని చెప్పక మౌనం వహిస్తారా? సహపంక్తి విఫలమయ్యాక సంధి విఫల మయినట్లే కదా!

సోనిటలాక్షా! యుద్ధం అనివార్యం!" అన్నది శివాని.

సైన్యాలు విక్రమించి పోరాటం ప్రారంభించాయి. మహావీరులంతా నేలకు ఒరిగిపోతున్నారు. కొమ్మరాజు పోయాడు. భీష్మాచార్యులు అంపశయ్య మీదికి పోయినట్లు కన్నమనీడు పోయాడు. జోదుల సోముడు పోయాడు. చింతపల్లి రెడ్డి పోయాడు.

చివరకు రాచమల్లు కూడ చనిపోయాడు.

దాంతో బ్రహ్మనాయునికి నవనాడులు క్రుంగిపోయినట్టు అయింది. రాచమల్లును రాజును చెయ్యాలనే కదా ఈ యుద్ధం? రాచమల్లు పోయాక ఇంకా ఎవరికోసం యుద్ధం చెయ్యాలి.

ఆదినించీ నాగమ్మ పైచికళే పైరాయి.

ఒంటరిగా యుద్ధ రంగంలోకి వెళ్ళి గురజాల సైన్యాలన్నిటినీ చంపివేసి తాను బ్రతకటమో, తానొక్కడూ మరణించి యుద్ధాన్ని ముగింపుకు తేవటమో తేల్చుకోవాలి.

ఎవరి సహాయమూ లేకుండా అసహాయశూరుడై కుంతాన్ని చేతపట్టుకుని యుద్ధరంగానికి వచ్చాడు శీలవు బ్రహ్మన్న.

నాగమ్మకు ఈ వార్త తెలిసింది. తాను కూడా సర్వ సైన్యాలను యుద్ధరంగం నుంచి ఉపసంహరించుకుంది.

"శివా! శంకరా! ఇంతకాలానికి కవచమూ, శిరస్త్రాణమూ ధరించమని ఆదేశించివా, దేవదేవా! నటజంగమా! నా చేత ఎంత నాటకం ఆడిస్తున్నావయ్యా!" అంటూ భగవధ్యానం చేసిం దామె.

కాసెమీద వీరకాసె బిగించి, బిగుతైన కంచుకం తొడిగింది. సుదీర్ఘమైన నీలి కుంతలాలను శిరస్త్రాణంలో దాచుకుంది. నటరాజు నిటలాక్షంలా కళ్ళు ఎర్రగా మండుతున్నాయి.

ఖడ్గాన్ని ధరించి, చువ్వికొను చిరచిరలాడే సింగిణిలో చెక్కి, ధనుర్బాణాలను చేతపట్టి జవనాశ్వాన్ని ఎక్కి వాయువేగంతో యుద్ధరంగానికి తరలివచ్చింది నాయకురాలు నాగలదేవి! శివాని!!

అల్లంత దూరాన ఆమెను చూచి కన్నెర్రచేశాడు శీలవు బ్రహ్మన్న.

"నాయుడా! స్వాగతమయ్యా! యుద్ధరంగానికి సుస్వాగతం. నీకు అభివందనాలు తెలుపుకుంటున్నది గురజాల మహామంత్రిణి నాగలదేవి" అన్నది నాయకురాలు శివాని.

"అతివా! నీ కెంత ధైర్యం. బ్రహ్మనాయుడి ఎదురు నిలిచావా? శివనందుల కోటను ఒక్క చేతి మీదుగా జయించాను. ఆ నాడు ఒంటరిగానే గురజాల మీదికి వచ్చినప్పుడు నీవు ఎనిమిదివేల సైన్యా



ఫోటో: సి. మహంతేష్

లను నగరిలో ఉంచుకుని కూడ నిర్భ్యర్ధ సంధి చేసుకున్నావు.

నాగలదేవీ! ఏ ధైర్యంతో నీవు ఈ నాడు నేనున్న రణ స్థలిలో కాలు పెట్టావు?'' అని అడిగాడు బ్రహ్మనాయుడు.

నాగమ్మ వింతుగా నవ్వి వూరుకుంది.

''అతివా! నవ్వుతా వెందుకు? నీకు కావలసిన రుద్ర భూమి ఈ నాగులేటి ఒడ్డున సృష్టించుకున్నావు. స్త్రీ బుద్ధి ప్రళయాంతకురాలని నిరూపించావు. ఎంత నెరజాణ వయినా ఈ బ్రహ్మనాయుని మీద కత్తి దువ్వటం హాస్యాస్పదం. చరిత్ర నిన్ను క్షమించదు, నాగమ్మా!

అనుగురాజు బిడ్డల్ని ఒకరి కొకరు కాకుండా చేశావన్న సంగతి ప్రపంచమంతా తెలిసిపోయింది'' అన్నాడు బ్రహ్మనాయుడు.

నాగమ్మ అంతర్యంలో అగ్ని కీలలు లేచాయి. వేదవేద్యుని ఆదశేషువు పడగ విప్పి బుస కొట్టింది.

''భళీ, భళీ! నాయుడా! లెస్స పలికినావు. చరిత్రకు చావు లేదు, నాయుడా! కొందరిని కొంతకాలం నమ్మించవచ్చు. అందరినీ కొంతకాలం నమ్మించవచ్చు. కాని, అందరినీ అంతకాలం నమ్మించటం ఎవరివల్లా అయే పనికాదు.

నీవు అన్నట్లుగా అతివనయి పుట్టి, అయినవారికి దూరమయి ఈ రాజకీయాలలో నేనెందుకు తల దూర్చాను. పలనాటి ప్రజలంతా నా బంధు బలగమే అనుకున్నాను. వారి యోగక్షేమాలే నా చూపు లక్ష్యం అనుకున్నాను. పలనాటి ప్రజలకోసమే నేను అలంకారంగా భావించాను. పలనాటి ప్రజలకోసమే నేను చేయగలిగినదంతా చేశాను.

అనుగురాజు బిడ్డలు ఎవరుండగా ఈ పలనాటి సీమను ఎనిమిది ముక్కలుగా చీల్చి పంచుకోవాలా? పలనాడు గుండెల్ని వ్రయ్యలు చెయ్యకపోవటం నా నేరమా?

స్త్రీ బుద్ధి ప్రళయాంతకమా?

అవునయ్యా! అవును. ఈ శివానీ ప్రళయాన్ని సృష్టించిన మాట నిజం. ఇలా ఎందుకు చేసిందో భావి చరిత్రకారులు గ్రహించకపోరు. ఈ శివానీ అంతర్యానికి అడ్డం పట్టి లోకాన చూపకపోరు. తను ఘటాలనోసుంచి అక్షరాక్షరంగా కురిపించక పోరు.

ఇంక అతివ, అతివ అంటున్నావు కదా!

అతివగా పుట్టినందుకు నేను రవంతయినా సిగ్గుపడి తల వంచను. ఈ అతివ కాదా—దక్షిణాది వారింటి ఆడుబిడుకు పసుపు కుంకాల క్రింద వచ్చిన రాజ్యాన్ని — ఉత్తరాది వారింటి ఆడ పడుచు సంతానానికి అంట గట్టాలని నీవు ప్రయత్నించటాన్ని వమ్ముచేసింది నిజం కాదా? ఈ అతివ కాదా ఏడు గడియల కాలంలో రాజుకు తెలియకుండా నడుస్తున్న కుతంత్రాన్ని బట్టబయలు చేసింది?

ఈ అతివకాదా చెరసాలకు కన్నం పొడిచిన వారికి దేశ బహిష్కరణ విధించింది?

ఈ అతివ కాదా—కోళ్ళ పోరులో విజయాన్ని చేపట్టి నిన్నూ, నీ వారినీ మండాది మాన్యాలు పట్టించింది?

ఈ అతివకాదా—ఈనాడు కార్యమపూడి రణ క్షేత్రంలో నీ వీరులనూ, తుదకు నీవు రాజును చేస్తానన్న రాజమల్లునూ వధింపచేసింది?

ఇన్ని విజయాలకు అడ్డురాని ఈ అతివతనం, ఇన్నిసార్లు నీ ఎత్తుల్ని చిత్తు చేయటానికి అడ్డురాని ఈ ఆడతనం ఈ నాడు రణస్థలిలో కత్తిపట్టటం దుకు అడ్డువచ్చిందా?

ఇంతకాలంగా అప్రతిహతంగా సాధిస్తూ వచ్చిన విజయమే ఈనాడు కదనరంగంలో కత్తి పట్టినా నాకు లభిస్తుంది.

కాబట్టి బ్రహ్మనాయుడా! యుద్ధానికి సిద్ధంకా!'' అన్నది నాగమ్మ. ఆమె నేత్రాలు విస్ఫులింగాలయినాయి.

బ్రహ్మనాయుడు గమ్మున కుంతాన్ని నేలకు విసరికొట్టాడు. ఆకాశం నించి విష్ణుతేజం రాలి పడినట్టుగా గుర్రం మీది నించి క్రిందికి దూకాడు.

''ఆడదానివి. అందునా భర్త ప్రహీనవు. ఈ బ్రహ్మనాయనికి నీతో యుద్ధమా? ఛీ! సిగ్గు చేటు. నేను ఈ క్షణం నించీ అస్త్ర సన్యాసం చేస్తున్నాను'' అన్నాడు నాయుడు. ఆ మాట అని రణస్థలి నించి తిరిగిపో సాగాడు.

నాగమ్మ గుర్రందిగి అతనికి ఎదురు వెళ్ళింది.

''నాయుడా! నీ ఆశయంకోసం నువ్వు పోరాడినావు. ఈ నాడు పంతం వదిలి అస్త్రసన్యాసం చేసినావు కనుక ఋషితుల్యుడవు అయినావు. నేను ఋషులకు మ్రొక్కుతాను, నాయుడా!

మలిదేవుడు మరణించాడు. నీవు పంతం వదలి పెట్టావు. నలజంగముడు తుది విజయం నాకే ఇచ్చాడు.

కాని, నాయుడా! ఈ రాజకీయ కశ్మలంలో నాకు కావలసిన ప్రశాంతతా, పవిత్రతా మట్టి కొట్టుకు పోయినాయి. నాకు మళ్ళీ మనశ్శాంతి కావాలి.

తపస్సనే అగ్నిలో నా శరీరాన్ని పునీతం చేస్తాను. ఇంక పలనాటికి నలగాముడే రాజు.

వారి భవితవ్యం గురించి నా కెటువంటి బెంగా లేదు. నాయుడా! వయసులో, జ్ఞానంలో నాకన్నా నీవు పెద్దవాడవు. ఈ పంతాలు, పట్టింపులు మళ్ళీ నా జ్ఞాపకాల తెరల్ని చించుకుని బయటకురాకుండా నన్ను ఆశీర్వదించు.

నిశ్చల తపస్సమాధిలో నన్ను పునీతను కానివ్వు. అగ్ని పునీతవుకావాలని ఆశీర్వదించవయ్యా నాయుడా!'' అంటూ అంజలి ఘటించి తనకన్నా పెద్దవాడయిన నాయని ముందు శిరసు వంచింది నాగమ్మ.

తన మెడలో ఉన్న తులసి మాలను తీసి ఆమెకు బహూకరించాడు బ్రహ్మన్న. ''తప ఫల సిద్ధిరస్తు'' అని ఆశీర్వదించాడు.

ఇరువురి నేత్రాలు అశ్రుతప్తాలయినాయి.

బ్రహ్మనాయని పవ్విని పాదాలే పరమేశ్వరుని పాదాలుగా భావించుకుని కన్నీటి జలకాలతో అభిషేకించింది నాగమ్మ.

పంతాలకు అతీతమయిన నిర్మల చిత్తంతో అనేక సంవత్సరాలు అరణ్యవాసం చేసిన శివానీ కాలగర్భంలో ఎప్పుడో, ఎక్కడో రాలిపోయింది.

ఉల్కలా వెలుగులోకాలకు జారిపోయింది.

అగ్నిపునీత అయిపోయింది.

(సమాప్తం)

## అల్పవిషయాలు

ఒక కుర్ర సన్యాసి తన జెన్ గురువు వద్దకు హడావిడిగా పరుగెత్తుకువెళ్ళి—''నిన్న రాత్రి నేను ధ్యానం చేస్తుండగా సాక్షాత్తు బుద్ధుడే గొప్ప కాంతి పుంజం మధ్య కనుపించాడు, స్వామీ! మళ్ళీ ఇవాళ ప్రొద్దున కూడా అదే మహాద్భుతమైన దర్శనం ఇప్పించాడు'' అని సంభ్రమంగా విన్నవించాడు.

''వెళ్ళి ధ్యానం తిన్నగా కొనసాగించు, నాయనా! ప్రాణాయామం గమనికతో జాగ్రత్తగా చేస్తూండు. ఈ మనో దృశ్యాలు వాటంతట అవే మాయమవు తాయిలే, బాబూ'' అని పంపించివేశాడు.

ఆధ్యాత్మికత, మనస్సృష్టి కారకాలైన దృశ్యాలను తిలకించడానికి గానీ, చిత్ర విచిత్రానుభూతులను పొందడానికి గానీ ఉద్దేశించింది కాదని గురుబోధ తాత్పర్యం.

-ప్రవీర్